మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

గురువారం 09-04-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 169

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

విలేకరులు కావలెను

తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

## 2 వారాలు కాల్పుల విరమణకు ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ అంగీకారం

# సీజ్‌ఫైర్



### లెబనాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

- 1982 తర్వాత ఇదే అతి పెద్ద దాడి
- 200 మందికి పైగా పౌరుల దుర్మరణం
- క్షతగాత్రులతో నిండిన దవాఖానలు
- లెబనాన్‌కు 'సీజ్ ఫైర్' వర్తించదన్న ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు
- సీజ్ ఫైర్ డీల్ జరిగినా ఆగని దాడులు
- ఇరాన్‌లోని ఆయిల్ రిఫైనరీపై బాంబులు
- గల్ఫ్ దేశాలపై విరుచుకుపడ్డ ఇరాన్


3

- యుద్ధానికి తాత్కాలిక బ్రేక్!
- రెండు వారాలు కాల్పుల విరమణ !
- 10న ఇస్లామాబాద్‌లో ప్రత్యక్ష చర్చలు
- 10 షరతులు విధించిన ఇరాన్
- స్వాగతించిన యుఎన్, రష్యా

**వాషింగ్టన్, టెహరాన్ :**
గత నెల రోజులకు పైగా ప్రపంచ దేశాలను వణికించిన పశ్చిమాసియా యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. రెండు వారాల పాటు ఇరాన్‌పై బాంబు దాడులను నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం ప్రకటించారు. ఇరాన్ పంపిన 10 పాయింట్ల ప్రతిపాదన ప్రాతిపదికన ఇరాన్‌తో ప్రత్యక్ష చర్చలు ఈ నెల 10న ప్రారంభమవుతాయని ప్రకటించారు.

-మిగతా 3 లో









## గెలుపు ముంగిట ఢిల్లీ బోల్తా

- ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ బోణీ
- ఉత్కంఠ పోరులో ఢిల్లీపై 1 రన్ తేడాతో విక్టరీ
- ఈ సీజన్‌లో తొలి ఓటమి చవిచూసిన ఢిల్లీ

**న్యూఢిల్లీ,**
ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ బోణీ కొట్టింది. బుధవారం చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచులో ఆ జట్టు.. ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఒక్క పరుగు తేడాతో ఓడించింది. చివరి బంతికి ఢిల్లీ విజయానికి 2 రన్స్ అవసరం కాగా.. ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బంతి వేశాడు. స్ట్రైకింగ్‌లో డేవిడ్ మిల్లర్ ఉన్నా.. రన్ కొట్టలేకపోయాడు. అయినా పరుగు కోసం ప్రయత్నించగా.. వికెట్ కీపర్ జోస్ బట్లర్ బంతితో నేరుగా వికెట్లను కొట్టడంతో కుల్‌దీప్ యాదవ్ రనౌట్ అయ్యాడు. దీంతో గుజరాత్ టైటాన్స్ గెలుపొందింది.211 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్లు కేఎల్ రాహుల్, పథుమ్ నిస్సాంక అదిరే ఆరంభం ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 8 ఓవర్లలో 76 పరుగులు జోడించారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ విజయంపై ధీమాగా ఉంది. కానీ నిస్సాంక (41)ను ఔట్ చేసిన ప్రసిద్ధ్ కృష్ణ.. గుజరాత్‌ను పోటీలోకి తెచ్చాడు.

-మిగతా 3 లో

# టీడీపీ 3.0

## సరికొత్త పంథాతో దూసుకెళ్తోంది

- ఏడాది పొడవునా శిక్షణ తరగతులు
- పైరవీలతో పనిలేదు.. పనితీరే ప్రామాణికం
- జూన్ తర్వాత అందరూ ప్రజాక్షేత్రంలోకి
- వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యం
- జగన్‌కు నిలకడలేదు, సీరియస్‌గా తీసుకోనక్కర్లేదు: లోకేశ్
- నేతలతో 'కాఫీ కబుర్లు'.. మై టీడీపీ టాప్-10 కార్యకర్తలతో భేటీ

**అమరావతి,**
తెలుగుదేశం పార్టీ 3.0 వర్షన్‌తో సరికొత్త పంథాలో దూసుకుపోతోందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ అన్నారు. బుధవారం మంగళగిరి టీడీపీ జాతీయ కార్యాలయంలో పార్టీ శ్రేణులకు శిక్షణ తరగతుల్లో భాగంగా 'కాఫీ కబుర్లు' పేరుతో పార్టీ క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులతో ఆయన సమావేశమయ్యారు. పైరవీలతో పనిలేకుండా పనిచేసే కార్యకర్తలను గుర్తించి పదవులిస్తామన్నారు. సభ్యత్వ నంబర్ ఎంటర్ చేస్తే ఎవరు ఎంత పనిచేశారో తెలిసిపోతోందని చెప్పారు.

-మిగతా 3 లో





## దంచికొడుతున్న ఎండలు

- 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా..
- ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 41.6
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

**హైదరాబాద్,**
రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో జనం బయటకు రావాలనే జంకుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రెండు ఆవర్తన ద్రోణుల ప్రభావంతో వచ్చే వారంపాటు పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నది. బుధవారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది.దీంతో ఆయా జిల్లాలకు

-మిగతా 3 లో

## 3 అసెంబ్లీలకు నేడు ఎన్నికలు

- కేరళ, అస్సాం, పుదుచ్చేరికి ఒకే విడతలో పోలింగ్
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- మే 4న ఫలితాలు



**న్యూఢిల్లీ,**
అస్సాం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల సంగ్రామం తుది అంకానికి చేరుకుంది. గురువారం రెండు రాష్ట్రాలు, ఒక యూటీలో ఒకే దశలో చేపడుతున్న పోలింగ్‌లో.. దాదాపు 5.3 కోట్లమంది ఓటర్లు ఆయా పార్టీల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. అస్సాంలో ద్విముఖ పోరు, కేరళలో సైద్ధాంతిక పోరు,

-మిగతా 3 లో

## యుద్ధంతో భారత వృద్ధికి ముప్పు

- పశ్చిమాసియా ఘర్షణలతో ప్రతికూలతే :
- ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆందోళన
- కీలక వడ్డీరేట్లు యథాతథం



**ముంబయి**
పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపబోతున్నాయని రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆందోళన వ్యక్తం చేశారు.

-మిగతా 3 లో

## చర్చలతోనే శాంతి స్థాపన

- కాల్పుల విరమణను స్వాగతించిన భారత్



**న్యూఢిల్లీ**
అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణను భారత్ బుధవారం స్వాగతించింది. పశ్చిమాసియాలో శాశ్వత శాంతిని నెలకొల్పేందుకు 'ఉద్రిక్తతల తగ్గింపు, చర్చలు, దౌత్యం' అవసరమని పిలుపునిచ్చింది. కాల్పుల విరమణ సమయంలో హెర్ముజ్

-మిగతా 3 లో

## ఏడాది చివరికల్లా రీసర్వే పూర్తి!

- జనవరి నుంచి ఇప్పటి వరకు 22.79 లక్షల పాస్ పుస్తకాల పంపిణీ
- వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి 9,956 గ్రామాల్లో 62,04,000 పీపీబీలు ఇవ్వాలనేది లక్ష్యం
- నేడు బాపట్ల జిల్లా సూరేపల్లిలో సీఎం పర్యటన
- అన్నదాతలకు పాస్‌పుస్తకాల అందజేత



**బాపట్ల,**
రీసర్వే, రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాల (పీపీబీ) పంపిణీని కూటమి ప్రభుత్వం యజ్ఞంలా చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 16,816 గ్రామాల్లో రీసర్వే చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 6,976 గ్రామాల్లో పూర్తయింది. 22.79 లక్షల పాస్‌పుస్తకాలను రైతులకు అందించింది. ఈ ఏడాది చివరినాటికి మిగతా గ్రామాల్లో కూడా రీసర్వే పూర్తిచేసి.. 62,04,000 పీపీబీలు ఇవ్వాలని లక్ష్యం గా నిర్దేశించుకుంది. ఆ దిశగా వడివడిగా అడుగులేస్తోంది. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం బాపట్ల జిల్లా వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామానికి రానున్నారు.

-మిగతా 3 లో

## ప్రభుత్వ వైద్యుల సేవలు మరువలేనివి

- కోవిడ్ వంటి కష్ట సమయాల్లో మెరుగైన వైద్య సేవలు
- డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తాం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా
- కోఠిలో తెలంగాణ వైద్య భవన్ ప్రారంభం




**సుల్తాన్ బజార్**
ప్రభుత్వ డాక్టర్లు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం తెలంగాణ వైద్య భవన్‌ను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యులు కోవిడ్ వంటి కష్ట సమయంలో వారు అందించిన సేవలు మరువలేనివన్నారు. ప్రజలకు సేవలందించే డాక్టర్లకు

-మిగతా 3 లో

# ఇరాన్ నుంచి వెంటనే బయటపడండి

**భారత పౌరులకు కేంద్ర తాజా అడ్వయిజరీ**



**న్యూఢిల్లీ ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ఇరాన్ దేశంలోని భారతీయులకు కేంద్ర ప్రభుత్వం మరోసారి కీలక అడ్వైజరీ జారీచేసింది. ఆ దేశం నుంచి వెంటనే బయటపడాలని సూచించింది. ఈ మేరకు ఇరాన్‌లోని భారత రాయబార కార్యాలయం 'ఎక్స్ (X)' వేదికగా పోస్టును పంచుకుంది. కేంద్ర ప్రభుత్వం సూచనల ఆధారంగా ఇరాన్ నుంచి బయటపడాలని కోరింది.ఇరాన్‌లోని రాయబార కార్యాలయాన్ని సంప్రదించకుండా లేదా వారితో సమన్వయం చేసుకోకుండా అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోకి రావద్దని హెచ్చరించింది. ఈ మేరకు రాయబార కార్యాలయం అత్యవసర సమయంలో సంప్రదించేందుకు ఫోన్ నెంబర్‌లు ఇచ్చింది. 0989128109115, 0989128109109, 0989128109102, 0989932179359, మెయిల్ ఐడి - cons.tehran@mea.gov.in ను షేర్ చేసింది. అమెరికా, ఇరాన్ దేశాలు గత రాత్రి రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించాయి. ఈ క్రమంలో నిన్న కూడా కేంద్రం ఒక అడ్వయిజరీ జారీచేసింది. అనవసర ప్రయాణాలు మానుకోవాలని, ఇళ్లలోనే ఉండాలని, అన్ని విద్యుత్, సైనిక స్థావరాలు, బహుళ అంతస్థుల భవనాలకు దూరంగా ఉండాలని సూచించింది. ఇప్పుడు కాల్పుల విరమణ నేపథ్యంలో తాజాగా మరో అడ్వైయిజరీ జారీచేసింది. ఇరాన్‌ను వెంటనే వీడాలని తాజా అడ్వయిజరీలో పేర్కొన్నది.

## తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన కేంద్ర ఎన్నికల సంఘం




**న్యూఢిల్లీ ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
కేంద్ర ఎన్నికల సంఘం పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేసింది. ఈసారి బెంగాల్‌లో ఎన్నికలు స్వేచ్ఛగా, నిర్భయంగా జరుగుతాయని పేర్కొన్నది. ఈసీ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ ట్వీట్ పోస్టు చేసింది. హింస లేకుండా, బెదిరింపులు లేకుండా, తనిఖీలు లేకుండా, పోలింగ్ బూత్‌ల్లో జామ్ లేకుండా ఎన్నికల నిర్వహణ జరగనున్నట్లు ఈసీ పేర్కొన్నది. ఇక ఆ రాష్ట్రానికి చెందిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి కూడా ఈసీ గట్టి వార్నింగ్ ఇచ్చింది. టీఎంసీకి సూటిగా హెచ్చరిక చేస్తున్నట్లు తన ట్వీట్‌లో ఈసీ చెప్పింది. కచ్చితంగా ఈసారి బెంగాల్‌లో ఎన్నికలు నిర్భయంగా, స్వేచ్ఛగా జరుగుతాయని పేర్కొన్నది.అయితే బుధవారం ఉదయం సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తృణమూల్ నేతలు కలిశారు. అక్కడ టీఎంసీ ఎంపీ డెరిక్ ఒబ్రెయిన్ .. సీఈసీపై గట్టిగా అరిచినట్లు తెలిసింది. ఆ సమయంలో సీఈసీ జ్ఞానేశ్, డెరిక్ ఒబ్రెయిన్ మధ్య వాగ్వాదం నడిచింది. తమను వెళ్లిపోవాలని సీఈసీ అరిచినట్లు ఒబ్రెయిన్ ఆరోపించారు. కానీ టీఎంసీ నేత చేసిన వ్యాఖ్యలను ఈసీ కొట్టిపారేసింది. సీఈసీని కలిసినవారిలో మేనకా గురుస్వామి, సాగరికా ఘోష్, సాకేత్ గోకలే ఉన్నారు. 27 లక్షల మంది ఓటర్ల తొలగింపు అంశంలో ఈసీతో చర్చించేందుకు టీఎంసీ ప్రయత్నించింది. ఏప్రిల్ 23, 29 తేదీల్లో బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే.

## ఇరాన్‌పై యుద్ధంతో అమెరికా ఏం సాధించింది



**శ్రీనగర్**
**ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్**
ఇరాన్‌పై 40 రోజుల యుద్ధంతో అమెరికా ఏమి సాధించిందని జమ్మకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రశ్నించారు. హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరిచేందుకు సిద్ధంగా ఉండాలనే షరతుపై మధ్యప్రాచ్యంలో రెండు వారాల కాల్పుల విరమణకు అంగీకరించిన సంగతి తెలిసిందే. కాల్పుల విరమణలో భాగంగా వ్యూహాత్మక హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరిచారన్న మీడియా నివేదికలపై బుధవారం ఆయన స్పందించారు. యుద్ధ ప్రారంభం కావడానికి ముందే ఆ మార్గం 'తెరిచి వుండటంతో పాటు స్వేచ్ఛగా అందుబాటులో' ఉందని అన్నారు. ఈ 39 రోజుల యుద్ధం అమెరికా ఏమి సాధించిందని ఎక్స్‌లో పేర్కొన్నారు. 'అన్యాయమైన యుద్ధం' అని హ్యాష్ టాగ్ పోస్ట్ చేశారు.

## కాల్పుల విరమణపై కశ్మీర్‌లో సంబురాలు



**శ్రీనగర్**
**ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంపై కశ్మీరీలు బుధవారం హర్షం వ్యక్తం చేశారు. దీన్ని ఇస్లామిక్ రిపబ్లిక్ విజయంగా వారు అభివర్ణించారు.వందలాది మంది ముఖ్యంగా షియా వర్గ ప్రాబల్యం కలిగిన కశ్మీర్ లోయలో ప్రజలు రోడ్ల పైకి వచ్చి ఇరాన్ జెండాలు ఊపుతూ, టపాసులు పేల్చి సంబురాలు చేసుకొన్నారు. 'ఈ కాల్పుల విరమణ ఇరాన్ సాధించిన విజయం. వాళ్లు అమెరికా, ఇజ్రాయెల్‌ను మోకాళ్ల మీద నిలబెట్టారు' అని బుద్గాంలోని ఓ షియా ముస్లిం అన్నారు.

# కోమాలో ఉన్న భర్త వీర్యం కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన భార్య..!




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
కోమాలో ఉన్న భర్త వీర్యం కోసం ఓ భార్య ఢిల్లీ హైకోర్టు ను ఆశ్రయించింది. తన భర్త 2025 మార్చి నెల నుంచి కోమాలో ఉన్నాడని, భవిష్యత్తులో ఆయన ద్వారా తల్లిని అయ్యేందుకు వీర్యం కావాలని, అందుకు తనకు అనుమతి ఇవ్వాలని పిటిషన్‌లో కోరింది. పిటిషనర్ తరఫున ఆమె న్యాయవాది అర్జిత్ గౌర్ వాదనలు వినిపించారు. అనంతరం తదుపరి విచారణను కోర్టు రేపటికి వాయిదా వేసింది.వివరాల్లోకి వెళ్తే.. ఢిల్లీకి చెందిన మహిళ భర్త 2025 మార్చిలో తలకు గాయం కావడంతో కోమాలోకి వెళ్లాడు. అప్పటి నుంచి అతడు వెంటిలేటర్ సపోర్టుపై ఉంటున్నాడు. ఈ క్రమంలో తాజాగా ఆయన భార్య ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసింది. భవిష్యత్తులో తన భర్త ద్వారా తాను తల్లిని కావడం కోసం కోమాలో ఉన్న తన భర్త వీర్యాన్ని సేకరించి, నిలువచేసుకునే అవకాశం ఇవ్వాలని ఆ పిటిషన్‌లో కోరింది. పిటిషనర్ తరఫున అర్జిత్ గౌర్ అనే న్యాయవాది వాదనలు వినిపించారు. అయితే తన భర్త ప్రస్తుత కండిషన్ నేపథ్యంలో వీర్య సేకరణ సురక్షితమా.. కాదా..? అనేది నిర్ధారించేందుకు మెడికల్ బోర్డును ఏర్పాటు చేయాలని పిటిషనర్ ప్రతిపాదించారు. సర్జికల్ విధానంలో వీర్యాన్ని నేరుగా టెస్టికల్స్ నుంచి ఫైన్ నీడిల్‌తో సేకరించాలని ఐవీఎఫ్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ శివాని సచ్‌దేవ్ చెప్పారు. కాగా ప్రస్తుత చట్ట ప్రకారం.. వీర్యాన్ని సేకరించి నిలువచేయడానికి భర్త, భార్య ఇద్దరి అంగీకారం అవసరం. ముందస్తు ఆమోదం ఉంటే మరణించిన భర్త నుంచి కూడా వీర్య సేకరణ చేయవచ్చు. కానీ ఈ కేసు ఆ రెండింటికి భిన్నమైనది కావడంతో క్లిష్టంగా మారింది. కేసు తదుపరి విచారణ గురువారం జరుగనుంది.

# అమెరికా కోర్టులో గౌతమ్ అదానీకి ఊరట..

**-పిటిషన్‌పై విచారణకు ఫెడరల్ కోర్టు అంగీకారం**




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ కి అమెరికా కోర్టు లో కీలక ఊరట లభించింది. తమపై యూఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్ నమోదు చేసిన ఫ్రాడ్ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపేందుకు న్యూయార్క్ లోని ఫెడరల్ కోర్టు అంగీకరించింది. ఈ కేసు అమెరికా చట్టాల పరిధిలోకి రాదని, ఇది పూర్తిగా దేశం వెలుపల జరిగిన వ్యవహారమని అదానీ తరఫు న్యాయవాదులు వాదిస్తున్నారు.భారత్‌లో సోలార్ ఎనర్జీ కాంట్రాక్టులు దక్కించుకునేందుకు భారత అధికారులకు 250 మిలియన్ డాలర్లకు పైగా లంచాలు ఇవ్వజూపారని, ఈ విషయాన్ని అమెరికా పెట్టుబడిదారుల నుంచి దాచిపెట్టి నిధులు సేకరించారని ఆరోపిస్తూ 2024 నవంబర్‌లో ఎస్ఈసీ ఈ కేసును దాఖలు చేసింది. ఈ కేసులో గౌతమ్ అదానీతోపాటు ఆయన బంధువు సాగర్ అదానీని కూడా ప్రతివాదిగా చేర్చింది. అయితే ఈ ఆరోపణలను అదానీ గ్రూప్ తీవ్రంగా వ్యతిరేకించింది. తమ పిటిషన్‌లో కీలక అంశాలను ప్రస్తావించింది.ఈ కేసు పూర్తిగా భారత్‌కు సంబంధించినదని దీనిపై విచారణ జరిపే అధికారం అమెరికా కోర్టులకు లేదని స్పష్టంచేసింది. అదానీ గ్రీన్ ఎనర్జీ 2021లో జారీ చేసిన బాండ్ల అమ్మకం అమెరికా వెలుపల జరిగిందని, ఈ బాండ్ల కాలపరిమితి కూడా ముగిసిందని తెలిపింది. 2024లో అసలు, వడ్డీతో సహా పెట్టుబడిదారులకు పూర్తి సొమ్మును తిరిగి చెల్లించామని, కాబట్టి ఎవరికీ ఆర్థిక నష్టం జరగలేదని కోర్టుకు వివరించింది. ఈ నేపథ్యంలో కేసును ప్రాథమిక దశలోనే కొట్టివేయాలని అదానీ తరఫు న్యాయవాదులు అభ్యర్థించారు.ఆ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న కోర్టు.. పిటిషన్‌పై విచారణ జరిపేందుకు అంగీకారం తెలిపింది. ఇది అదానీకి తొలి విజయం కాగా.. సుదీర్ఘమైన విచారణ ప్రక్రియను తప్పించుకునేందుకు ఆయనకు ఒక అవకాశం లభించినట్లయ్యింది.

# మరో ఆరు నెలలు బిహార్ సీఎంగా నితీష్ కుమార్

**తర్వాతి సీఎంగా నితీష్ తనయుడు నిశాంత్..?**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
బిహార్ రాజకీయాల్లో ఇంకా నితీష్ కుమార్ హవానే కొనసాగే అవకాశం ఉంది. మరో ఆరు నెలలు నితీషే సీఎంగా ఉంటారని ఆయన ప్రధాన అనుచరుడు, మంత్రి శ్రావణ్ కుమార్ తెలిపారు. ఆ తర్వాత బిహార్ సీఎంగా నితీష్ తనయుడు నిశాంత్ పదవి చేపట్టడాన్ని కొట్టిపారేయలేమన్నారు. ప్రస్తుతం బిహార్ సీఎంగా ఉన్న నితీష్ కుమార్ రాజ్యసభకు ఎన్నికైన సంగతి తెలిసిందే. మరో వారంలోపే ఆయన రాజ్యసభ సభ్యుడిగా ప్రమాణం చేస్తారు. ఇప్పటికే ఆయన తన లెజిస్లేటివ్ కౌన్సిల్ సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో బిహార్ అసెంబ్లీని వీడాల్సి ఉంటుంది.ఇదే సమయంలో ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేస్తారనే ప్రచారం జరుగుతోంది. అయితే, నిబంధనల ప్రకారం అసెంబ్లీలో ఎమ్మెల్యే లేదా ఎమ్మెల్సీ పదవి లేకపోయినా గరిష్టంగా ఆరు నెలలపాటు సీఎం పదవిలో కొనసాగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఆయన 6 నెలలపాటు రాజ్యసభకు వెళ్లకుండా బిహార్‌లోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. మరో ఆరు నెలలపాటు బిహార్ సీఎంగా కొనసాగుతారని జేడీయూ నేత, రాష్ట్ర మంత్రి, నితీష్ అనుచరుడు శ్రావణ్ కుమార్ వెల్లడించారు. తాను ఎంతకాలం సీఎం పదవిలో ఉండాలి, ఎప్పుడు రాజీనామా చేయాలి అనే విషయంలో నితీషే స్వతంత్రంగా నిర్ణయం తీసుకుంటారని శ్రావణ్ అన్నారు. తన రాజకీయ నిర్ణయాల్ని ఆయనే సొంతంగా తీసుకుంటారని తెలిపారు. ఢిల్లీకి వెళ్లి రాజ్యసభ ఎంపీగా నితీష్ ఎప్పుడు ప్రమాణం చేస్తారనే విషయంలో తనకు సమాచారం లేదన్నాడు. ఒకవేళ తనకు సీఎంగా ఉండాలని అనిపిస్తే, రాజ్యసభ ఎంపీగా ప్రమాణం చేసినప్పటికీ, బిహార్ సీఎంగా కొనసాగుతారని స్పష్టం చేశారు రాజ్యాంగం ప్రకారం ఆరు నెలలపాటు ఈ వెసలుబాటు ఉన్న విషయాన్ని శ్రావణ్ గుర్తు చేశారు. అలాగే, నితీష్ తర్వాత ఆయన తనయుడు నిశాంత్ కుమార్ సీఎం కావాలంటూ కొందరు డిమాండ్ చేస్తుండటంపై కూడా ఆయన స్పందించారు. ఈ డిమాండ్‌లో తప్పేమీ లేదన్నాడు. నిశాంత్ యువకుడని, సమర్థుడు, విద్యావేత్త అని, అయితే నిశాంత్ విషయంలో తుది నిర్ణయం నితీష్ కుమార్‌తోపాటు పార్టీ వర్గాలు తీసుకుంటాయని తెలిపాడు. ప్రస్తుతం నితీష్ సీఎంగా కొనసాగుతారా.. లేక పదవికి రాజీనామా చేస్తారా అనే అంశంపై బిహార్ రాజకీయవర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

## గంగానది వద్ద మద్యం తాగి.. పోలీసులతో మహిళ వాగ్వాదం..



**రిషికేశ్ -ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ఉత్తరాఖండ్ లోని రిషికేశ్‌లో ఓ మహిళ గంగానది తీరం వద్ద మద్యం తాగి హల్‌చల్ చేసింది. అడ్డుకున్న స్థానిక పోలీసులతో ఆమె వాగ్వాదానికి దిగింది. ఈ ఘటనకు చెందిన వీడియో వైరల్ అవుతోంది. నీలకంఠ మార్గంలో ఉన్న ఫూల్ ఛాటి ఏరియాలో ఈ ఘటన ఏప్రిల్ 6వ తేదీన జరిగింది. హర్యానాకు చెందిన ఓ మహిళ .. గంగానది ఘాట్ వద్ద మద్యం సేవించింది. పబ్లిక్‌గా మద్యం తాగవద్దు అని పోలీసులు వారించారు. కానీ ఆమె వారితో కొట్లాటకు దిగింది. గట్టిగా అరుస్తూ పోలీసుల మీదకు వెళ్లింది. మేం టూరిస్టులం, మేం వస్తేనే మీకు రోజు గడుస్తుందని ఆమె అరిచింది. స్వంత డబ్బులతో మద్యం సేవిస్తున్నానని, టూరిస్టులతో వ్యవహరించే తీరు ఇది కాదు అని ఆమె పేర్కొన్నట్లు వీడియోలో ఉంది. చివరకు ఆమె భర్త వచ్చి ఆ గొడవను ఆపాడు. ఆ మహిళ ప్రవర్తించిన తీరు పట్ల సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి.

## బిజెపి చెప్పుచేతల్లో ఎన్నికల సంఘం

**ఢిల్లీ మాజీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శలు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్**
భారత ఎన్నికల సంఘం బిజెపి కింద పనిచేస్తోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదని ఆమ్‌ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఇసిపై తీవ్ర విమర్శలు చేశారు. బుధవారం ఉదయం తృణమూల్ కాంగ్రెస్ బృందం భారత ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్‌ని కలిసి.. పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో ఎన్నికలు భయరహితంగా, హింసారహితంగా, బెదిరింపులు, ప్రలోభాలు, దాడులు లేకుండా జరపాలని కోరింది. అయితే ఇసికి, టిఎంసి బృందానికి మధ్య ఏడు నిమిషాల పాటు సమావేశం జరిగింది. ఈ చర్చల్లో తాము చెప్పినవి వినకుండా ఇసి చీఫ్ జ్ఞానేశ్ కుమార్ ఇక్కడి నుంచి వెళ్లిపోండి అని అవమానించినట్లుగా టిఎంసి బృందం వెల్లడించింది. టిఎంసి బృందానికి జరిగిన అవమానంపై ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ స్పందించారు. ఎన్నికల సంఘం బిజెపికి అనుకూలం. బిజెపి చెప్పినట్టే పనిచేస్తుంది. బిజెపి నుంచి నేరుగా అందే ఆదేశాలను ఇసి తీసుకుంటుంటోందని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ విషయం ఇప్పుడు బహిరంగమైంది. ఇది అత్యంత దురదృష్టకరం అని కేజ్రీవాల్ ఎక్స్ పోస్టులో ఇసిని విమర్శించారు.

# దంచికొడుతున్న ఎండలు

**మొదటి** తరువాయి

ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే మూడ్రోజులు ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో అత్యధికంగా 41.6 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5, నల్లగొండ జిల్లా నేరడుగొమ్మలో 41.5, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 41.4, జనగామ జిల్లా పాలకుర్తిలో 41.2, వరంగల్ జిల్లా సంగెంలో 41.2, హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించింది. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

# గెలుపు ముంగిట ఢిల్లీ బోల్తా

**మొదటి** తరువాయి

నితీశ్ రాణా (5), సమీర్ రిజ్వీ (0) స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్ చేరారు. మ్యాచ్ గెలిపించేలా కనిపించిన కేఎల్ రాహుల్ (52 బంతుల్లో 92 రన్స్) చివర్లో ఔట్ అయ్యాడు.గాయం కారణంగా తొలుత మైదానాన్ని వీడిన డేవిడ్ మిల్లర్.. ఆ తర్వాత జట్టు కష్టాల్లో ఉందన బ్యాటింగ్‌కు వచ్చాడు. ధనాధన్ షాట్లతో ఢిల్లీని విజయానికి చేరువచేశాడు. డీసీ చివరి బంతికి 2 రన్స్ అవసరం కాగా.. మిల్లర్ బంతిని హిట్ చేయలేకపోయాడు. వికెట్ కీపర్ బట్లర్.. బంతిని నేరుగా వికెట్లకు కొట్టడంతో ఢిల్లీ ఒక్క రన్ తేడాతో ఓడిపోయింది. డేవిడ్ మిల్లర్ 20 బంతుల్లో 41 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. ఈ టోర్నీలో ఢిల్లీకి ఇదే తొలి ఓటమి కాగా.. గుజరాత్‌కు ఇదే తొలి విజయం. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ భారీ స్కోరు చేసింది. ఫిట్‌నెస్ సమస్యలతో గత మ్యాచుకు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రీఎంట్రీతో అదరగొట్టాడు. 45 బంతుల్లో 70 రన్స్ చేశాడు. జోస్ బట్లర్ 27 బంతుల్లో 52 రన్స్, వాషింగ్టన్ సుందర్ 32 బంతుల్లో 55 రన్స్ చేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది.

# చర్చలతోనే శాంతి స్థాపన

**మొదటి** తరువాయి

జలసంధి గుండా వాణిజ్య నౌకల ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు కలుగవని తాము భావిస్తున్నట్టు తెలిపింది. ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. చర్చలు, దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ మొదటి నుంచీ ఇరు దేశాలకు చెప్తూనే ఉంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ముడి చమురు, సీఎన్‌జీ వంటి ఉత్పత్తుల రవాణాకు ఆటంకం ఏర్పడటంతో భారత్ సహా చాలా దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.

# యుద్ధంతో భారత వృద్ధికి ముప్పు

**మొదటి** తరువాయి

ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీజీ) సమావేశం అనంతరం బుధవారం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. యుద్ధం వల్ల తలెత్తే పరిణామాలను ప్రస్తావించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం అంతర్జాతీయంగా అనిశ్చితిని పెంచిందన్నారు. ఇది భారత వృద్ధికి సవాలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గతంలో దేశీయ ఆర్థిక పునాదులు పటిష్టంగా ఉన్నప్పటికీ మార్చి నెలలో యుద్ధ తీవ్రత పెరగడంతో పరిస్థితులు ప్రతికూలంగా మారాయని ఆయన విశ్లేషించారు. ముడిచమురు ధరలు పెరగడం వల్ల దిగుమతి ద్రవ్యోల్బణం పెరగడమే కాకుండా, కరెంట్ అకౌంట్ లోటు (సీఏడీ) మరింత విస్తరించే ప్రమాదం ఉందన్నారు.

**రెపోరేటు 5.25 శాతమే..**

అధిక వ్యయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రుణగ్రహీతలు వడ్డీ రేట్లు తగ్గుతాయని ఆశించిన వారికి ఆర్‌బీఐ నిర్ణయం నిరాశకు గురి చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరపు తొలి సమీక్షలో రెపో రేటును 5.25 శాతం వద్దే యథాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. గతేడాది ఫిబ్రవరి ఫిబ్రవరి నుంచి దాదాపు 1.25 శాతం మేర రేట్లను తగ్గించిన ఆర్‌బీఐ ఈసారి మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ నిర్ణయం వల్ల బ్యాంకుల వద్ద వడ్డీ రేట్లు స్థిరంగా ఉండటమే కాకుండా పారిశ్రామిక వృద్ధికి, సామాన్యుల ఇఎంఐలపై భారం పడకుండా దోహదపడుతుందని గవర్నర్ పేర్కొన్నారు.

**డిమాండ్‌కు విఘాతం..**

పశ్చిమాసియా యుద్ధం వల్ల సరఫరా వ్యవస్థలో తలెత్తే అడ్డంకులు దేశంలోని పరిశ్రమలు, వ్యవసాయం, సేవా రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని గవర్నర్ మల్హోత్రా వివరించారు. ముఖ్యంగా హార్ముజ్ జలసంధిలో రవాణా ఆటంకాల వల్ల ముడివస్తువుల లభ్యత తగ్గి, దేశీయ ఉత్పత్తి క్షీణించవచ్చని హెచ్చరించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగిస్తే భారత ఎగుమతులు, రెమిటెన్స్‌ల ప్రవాహంపై ప్రభావం పడుతుందన్నారు. ఇది చివరకు దేశీయంగా అప్పుల భారాన్ని కూడా పెంచవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. "సరఫరా వ్యవస్థలో మొదలైన అడ్డంకులు పునరుద్ధరణలో ఆలస్యమైతే.. అది మధ్యకాలికంగా డిమాండ్ పడిపోవడానికి దారితీయవచ్చు" అని మల్హోత్రా హెచ్చరించారు.

# ప్రభుత్వ వైద్యుల సేవలు మరువలేనివి

**మొదటి** తరువాయి

అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తుందని తెలిపారు. దశాబ్దాలుగా వైద్యులు కోరుతున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చినట్టు వెల్లడించారు. గోషామహల్‌లో సుమారు 26 ఎకరాల్లో రూ.3000 కోట్లతో అత్యాధునిక ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఇది రాష్ట్ర ఆరోగ్య రంగంలో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రెండేండ్లలో ఆరోగ్యశాఖలో 10,327 నియామకాలు పూర్తి చేసినట్టు తెలిపారు. మరో 6,000కి పైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ఇటీవల 174 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నియామక ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించారు. భవిష్యత్‌లో డాక్టర్లకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. డీపీహెచ్, టీవీవీపీలో పనిచేస్తున్న స్పెషలిస్టులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అవకాశాలు కల్పించినట్టు తెలిపారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం పెంచినట్టు చెప్పారు. ట్రాన్స్‌ఫర్లను పారదర్శకంగా నిర్వహిస్తూ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్స్ ఇస్తున్నామని తెలిపారు. అయితే, ప్రతి ఒక్కరూ హైదరాబాద్‌లోనే పోస్టింగ్ కోరడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ట్రాన్స్‌ఫర్లు, డిప్యుటేషన్ల పేరుతో వైద్య సేవలకు అంతరాయం కలిగించొద్దని సూచించారు.

# సీజ్‌ఫైర్..

**మొదటి** తరువాయి

అయితే హార్ముజ్ జలసంధిని తెరవాలన్న షరతుకు లోబడే ఈ చర్చలు జరుగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు. ఇది తాము సాధించిన విజయంగా ట్రంప్ చెప్పుకున్నారు. మరోవైపు ఇరాన్ కూడా తన వైఖరిని స్పష్టం చేసింది. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు తమపై దాడులు నిలిపి వేసినట్లైతే, తాము కూడా దాడులను ఆపుతామని ప్రకటించింది. తమ సాయుధ బలగాల సమన్వ యంతోనే హార్ముజ్‌లో నౌకల రవాణా కొనసాగు తుందని తెలిపింది. ఇది ఇరాన్ సాధించిన దౌత్య విజయం అని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చి ఒక ప్రకటన విడుదల చేశారు. లెబనాన్‌తో సహా అన్ని రంగాల్లో తక్షణమే కాల్పుల విరమణ జరిపేందుకు అన్ని పక్షాలు, వాటి మిత్రపక్షాలు అంగీకరించాయని పాకిస్తాన్ వెల్లడించింది. ఇరు పక్షాల మధ్య కాల్పుల విరమణ కోసం ఇప్పటివరకు మధ్యవర్తిత్వం నెరిపిన పాకిస్తాన్ ఈ నెల 10న జరిగే ప్రత్యక్ష చర్చలకు ఆతిథ్యం ఇవ్వనున్నట్ల ప్రకటించింది. శుక్రవారం ఇరు పక్షాలు ప్రత్యక్ష చర్చల కోసం ఇస్లామాబాద్‌కు రావాల్సిందిగా ప్రధాని షరీఫ్ ఆహ్వానించారు. లెబనాన్‌తో సహా అన్ని చోట్లా తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని ఆయన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

**90 నిముషాలు ముందుగా...**

హార్ముజ్‌ను తెరిచేందుకు ఇరాన్‌కు విధించిన గడువు ముగియడానికి కేవలం 90నిముషాలు ముందుగా ట్రంప్ ప్రకటన వెలువడింది. ఇరాన్ గనక తమ ఒప్పందానికి ఆమోదించని పక్షంలో ఇరాన్ నాగరితకను ఒక రాత్రిలోగా నాశనం చేస్తామంటూ ట్రంప్ పదే పదే హెచ్చరికలు జారీ చేశారు. ఆ తరుణంలో చిట్టచివరి నిముషంలో పాకిస్తాన్ అందచేసిన ఇరాన్ ప్రతిపాదనతో ఇదంతా జరిగింది. ఇరాన్ ప్రతిపాదనల ప్రాతిపదికగా ఉభయ పక్షాలు చర్చలు జరపడానికి అంగీకారం కుదిరింది. "పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌లతో జరిగిన సంభాషణల మేరకు, హార్ముజ్ జలసంధిని తక్షణమే తెరిచి, నౌకలను సురక్షితంగా పంపేందుకు ఇరాన్ అంగీకరించినందున, ఇరాన్‌పై రెండు వారాల పాటు బాంబు దాడులు నిలిపివేయడానికి నేను అంగీకరిస్తున్నాను. ఇది ఉభయ పక్షాల కాల్పుల విరమణగా వుంటుంది." అని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు.

# లెబనాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

- -1982 తర్వాత ఇదే అతి పెద్ద దాడి
- -200 మందికి పైగా పౌరుల దుర్మరణం
- -క్షతగాత్రులతో నిండిన దవాఖానలు
- -లెబనాన్‌కు 'సీజ్ ఫైర్' వర్తించదన్న ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు
- -సీజ్ ఫైర్ డీల్ జరిగినా ఆగని దాడులు
- -ఇరాన్‌లోని ఆయిల్ రిఫైనరీపై బాంబులు
- -గల్ఫ్ దేశాలపై విరుచుకుపడ్డ ఇరాన్

న్యూఢిల్లీ/ :

అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం (సీజ్ ఫైర్ డీల్) కుదిరినప్పటికీ.. పశ్చిమాసియాలో బుధవారం కూడా దాడులు కొనసాగాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. 10 నిమిషాల వ్యవధిలోనే ఏకంగా 100 వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 200 మందికి పైగా మృత్యువాతపడగా.. 700 మంది క్షత్రగాత్రులయ్యారు. 1982 తర్వాత లెబనాన్‌పై ఇదే అతి పెద్ద దాడి అని అధికారులు తెలిపారు. మరోవైపు, ఇరాన్‌లోని ఓ చమురు శుద్ధి కేంద్రంపై దాడులు జరగ్గా..




దీనికి ప్రతిగా కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌పై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది

భీతావహంగా లెబనాన్

లెబనాన్‌పై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) భీకర దాడులు జరిపింది. బీరుట్, దక్షిణ లెబనాన్, బెకా నగరాలతో పాటు హెజ్బొల్లా ఉపయోగించే కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు, స్థావరాలు, ఇతర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా 10 నిమిషాల వ్యవధిలోనే 100 ఎయిర్‌స్ట్రైక్స్ చేసింది. ఈ భీకర దాడుల్లో 89 మంది ప్రజలు మృత్యువాతపడ్డారు. 700 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ఈ దాడుల్లో లెబనాన్‌లోని ప్రముఖ మత పెద్ద సాధిక్ అలీ నబుల్సీ మృతి చెందారు. 1982 తర్వాత లెబనాన్‌పై జరిగిన అతిపెద్ద దాడి ఇదేనని అధికారులు తెలిపారు. దాడులు జరిగిన ప్రాంతాల్లో అంబులెన్సులు, వైద్య సిబ్బంది, పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టినట్టు రెడ్‌క్రాస్ వెల్లడించింది. క్షతగ్రాత్రులతో లెబనాన్‌లోని అన్ని దవాఖానలు నిండిపోయినట్టు ఆరోగ్యమంత్రి తెలిపారు.

మిత్ర దేశాలు సాయం చేయాలి

పౌర సమాజంలో హెజ్బొల్లా పాతుకుపోవడాన్ని లెబనాన్ ప్రభుత్వం, అక్కడి ప్రజలు వ్యతిరేకించాలని ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. లేకపోతే, ఇలాంటి పరిస్థితులు పునరావృతమవుతాయని హెచ్చరించింది. మరోవైపు, ఇజ్రాయెల్ దాడులను నిలుపుదల చేసేందుకు సాయం చేయాలని మిత్ర దేశాలకు లెబనాన్ ప్రధాని నవాఫ్ సాలమ్ విజ్ఞప్తి చేశారు. ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాము స్వాగతిస్తున్నామన్న సాలమ్.. తాము కూడా ఈ ఒప్పందంలో భాగమైనట్టు తెలిపారు. అయినప్పటికీ, ఇజ్రాయెల్ ఇలా విరుచుకుపడటమేంటని ప్రశ్నించారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులపై హెజ్బొల్లా ఇంకా స్పందించలేదు.

# టీడీపీ 3.0

**మొదటి** తరువాయి

ఇటీవల పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తామంతా కింద కూర్చోగా, అధినేత చంద్రబాబు పక్కన సామాన్య కార్యకర్తలు కూర్చున్నారని.. పార్టీలో వస్తున్న అనూహ్య మార్పులకు ఇదొక సంకేతమన్నారు. 'తెలుగుదేశం పార్టీ రాజకీయ విశ్వవిద్యాలయం. తెలంగాణలో ప్రస్తుత, మాజీ ముఖ్యమంత్రులతో పాటు అక్కడి మెజారిటీ నాయకులు టీడీపీ నుంచి వచ్చినవారే. 1989-94 మధ్య పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న చంద్రబాబు ట్రైనింగ్ క్లాసులు పెట్టి క్యాడర్‌ను చైతన్యవంతం చేశారు. అయితే పార్టీ ఆవిర్భావం తర్వాత అట్టడుగు స్థాయి నుంచి క్యాడర్‌కు పెద్దఎత్తున శిక్షణ తరగతులు నిర్వహించడం ఇదే ప్రథమం. పార్టీని క్షేత్ర స్థాయి నుంచి బలోపేతం చేయడం, పనిచేసే కార్యకర్తలను ప్రోత్సహించడమే వీటి ప్రధాన లక్ష్యం. ఇకపై క్లస్టర్, యూ నిట్, గ్రామ, మండలస్థాయి వరకు ఏడాది పొడవునా 365 రోజులూ నిరంతరం శిక్షణ తరగతులు పెడతాం' అని వెల్లడించారు

**జగన్‌కు నిలకడ లేదు..**


వైసీపీ అధినేత జగన్ మాటలను ఎవరూ సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం లేదని లోకేశ్ అన్నారు. 'నిన్న మావిగన్ అన్న నోటితోనే మళ్లీ ఈ రోజు 3 రాజధానులు అంటున్నా రు. అధికారంలో ఉన్నప్పుడే కాకుం డా ఇప్పుడు కూడా ఆయన ప్రజలకు దగ్గరగా ఉండడం లేదు. ఇంటి వద్ద 30 అడుగుల ఇనుప కంచె ఏర్పాటు చేసుకున్నారు. 2019లో టీడీపీ ఓటమి పాలైనా.. చంద్రబాబు అనునిత్యం జనంలోనే ఉన్నారు. వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు. ఏడాదిలోనే ఇసుక కష్టాలపై ఉద్యమించారు. కార్యకర్తల ఆవేదనా విన్నారు. క్యాడర్‌కు దగ్గరగా ఉంటూ ముందుకు సాగుతున్నారు. పార్టీ శ్రేణులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు మార్గాలను అన్వేషిస్తున్నారు. పార్టీలో పనిచేయడానికి పదవులే ప్రామాణికం కాదు. వివిధ సమీకరణల వల్ల ఇప్పుడు అవకాశం రానివారికి మరోసారి కల్పిస్తాం' అని చెప్పారు.

**టాప్-10 కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం..**

కష్టపడిన వారిని గుర్తించాలనేది పార్టీ సిద్ధాంతమని లోకేశ్ స్పష్టంచేశారు. రాష్ట్రవ్యాప్తంగా 'మైటీడీపీ' యాప్ సమర్థ వినియోగం, పార్టీ పిలుపి చ్చిన కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటూ మంచి పనితీరు కనబరచిన టాప్-10 కార్యకర్తలతో టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించి వారి కష్ట సుఖాలు అడిగి తెలుసుకున్నారు. 'తెలుగుదేశం పార్టీ ఒక వ్యవస్థ. మనందరం అందులో భాగం. మీ పనితీరు వల్లే ఇక్కడవరకు రాగలిగారు. పార్టీ పిలుపిచ్చిన కార్యక్రమాలను సక్రమంగా నిర్వహిస్తే పార్టీ వందేళ్లు ఉంటుంది. వ్యక్తుల కంటే పార్టీ ముఖ్యమని గుర్తించాలి. పార్టీలో సంస్కరణల కోసం పోరాడుతున్నా. కార్యకర్తే అధినేత, గ్రామ పార్టీ అధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పొలిట్‌బ్యూరో వరకు రాగలగాలి. పార్టీ భవిష్యత్ దృష్ట్యా కడప మహానాడులో తీర్మానించిన 6 శాసనాలతో జనంలోకి వెళ్లాలి' అని చెప్పారు. అనంతరం వారందరినీ ఘనంగా సత్కరించి ఎన్టీఆర్ జ్ఞాపికను బహుకరించారు. లోకేశ్‌తో ఆత్మీయ భేటీని జీవితాంతం మరువలేమని 'మైటీడీపీ' ఉత్తమ కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

# ఏడాది చివరికల్లా రీసర్వే పూర్తి!

**మొదటి** తరువాయి



మీ భూమి-మీహక్కు' కార్యక్రమంలో పాల్గొ ని అన్నదాతలకు పాస్ పుస్తకాలను పంపిణీ చేయనున్నారు. సూరేపల్లి రెవెన్యూ గ్రామం లో మొత్తం 1,130.30 ఎకరాల విస్తీర్ణం ఉండగా రీసర్వే అనంతరం రెవెన్యూ శాఖ 504 పాస్‌పుస్తకాలను ముద్రించింది. వీటిని సీఎం స్వయంగా అన్నదాతలకు అందజేస్తారు. జగన్ ఏలుబడిలో రీసర్వే పేరిట నానా హడావుడిచేసి అనేక భూ వివాదాలకు గ్రామాల్లో ఆజ్యం పోశారు. తాతతండ్రులు సంపాదించుకున్న పొలాల హద్దురాళ్లు, పాస్ పుస్తకాలపైనా తన ఫొటోలు ముద్రించుకున్నారు.కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే వాటిని ప్రక్షాళన చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన సంగతి తెలిసిందే. రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రాజముద్రతో పాస్‌పుస్తకాలిస్తోంది. ఈ ఏడాది జనవరిలో 4,783 గ్రామా ల పరిధిలో 18.77 లక్షల పాస్‌పుస్తకాలు, ఫిబ్రవరిలో 279 గ్రామాల్లో 1,16.129, మార్చిలో 299 గ్రామాల పరిధిలో 1,29,298.. మొత్తంగా జనవరి నుంచి ఇప్పటి వరకు 5,717 గ్రామాల్లో 22.79 లక్షల పీపీబీలను అందించింది. ఈ ఏడాది చివరి నాటికి అన్ని గ్రామాల్లో రీసర్వే పూర్తి చేయడంతో పాటు పాస్‌పుస్తకాల పంపిణీని వచ్చే ఏడాది ప్రథమార్థం కల్లా పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టింది.

# 3 అసెంబ్లీలకు నేడు ఎన్నికలు

**మొదటి** తరువాయి

పుదుచ్చేరిలో బహుముఖ పోటీపై నేడు ఓటర్ల తీర్పు చెప్పనున్నారు. రెండు రాష్ట్రాలు, ఒక యూటీలో పోలింగ్ ఉదయం 7 గంటలకు మొదలుకానున్నది. వేలాదిగా ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌ల వద్ద పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరించగా, వెబ్‌కాస్టింగ్ వంటి ఏర్పాట్లు జరిగాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

**కేరళలో హ్యాట్రిక్ విజయంపై విజయన్ కన్ను**

140 అసెంబ్లీ స్థానాలున్న దేవభూమి కేరళలో అధికార ఎల్డీఎఫ్, విపక్ష యూడీఎఫ్ మధ్యే ప్రధాన పోటీ నెలకొన్నది. 883 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. విజయన్ సారథ్యంలోని ఎల్డీఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నది. అయితే ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ధీమా వ్యక్తం చేస్తున్నది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఖాతా తెరువని కమలం పార్టీ.. ఈ సారి ఎలాగైనా ఉనికి చాటుకోవాలని తాపత్రయపడుతున్నది. మొత్తం ఓటర్లలో 1.32 కోట్ల మంది పురుషులు, 1.39 కోట్ల మంది మహిళలు ఉన్నారు.

**అస్సాం.. ఎవరి పక్షం?**

అస్సాంలో బీజేపీ-కాంగ్రెస్ కూటమి మధ్యే ప్రధాన పోటీ నెలకొన్నది. ఇక్కడ గౌరవ్ గొగోయ్ కాంగ్రెస్‌కు నేతృత్వం వహిస్తుండగా, సీఎం హిమంత నాయకత్వంలో బీజేపీ కూటమి మూడోసారి విజయంపై కన్నేసింది. 2016లో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోగా, ఈసారి విజయం కోసం 99 స్థానాల్లో తమ అభ్యర్థుల్ని బరిలోకి దింపింది. 126 అసెంబ్లీ స్థానాలున్న ఈ రాష్ట్రంలో ఓటర్లు 2.50 కోట్లమంది ఉండగా, దీంట్లో 1.25 కోట్ల మంది మహిళలు, 318 మంది థర్డ్ జెండర్ ఉన్నారు.

**పుదుచ్చేరిలో పాగా వేసేదెవరు?**

కేవలం 30 అసెంబ్లీ స్థానాలు.. దాదాపు 9.5 లక్షల మంది ఓటర్లు కలిగిన పుదుచ్చేరిలో పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 294 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలబడ్డారు. రాష్ట్ర హోదా ప్రధాన అంశంగా ఈసారి పుదుచ్చేరి ఎన్నికల సంగ్రామం సాగింది. ఇక్కడ డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్నప్పటికీ పుదుచ్చేరిలో స్వతంత్ర పాలన లేదని కాంగ్రెస్-డీఎంకే కూటమి ఆరోపిస్తున్నది. విజయ్ రంగ ప్రవేశంతో ఈ సారి ఇక్కడ త్రిముఖ పోరు నెలకొన్నది.

# సంపాదకీయం

## రెండు వారాల యుద్ధ విరామం

### సూత్రధారి చైనా, పాత్రధారి పాక్?



రెండువారాల పాటు ఇరాన్‌పై దాడులను విరమిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రకటించాడు. భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారు జామున ఈ ప్రకటన వెలువడింది. దానికి ప్రతిగా హార్ముజ్ జలసంధిని తెరిచేందుకు ఇరాన్ అంగీకరించింది. రెండు దేశాల మధ్య కుదిరిన ఒప్పందాన్ని తాను సమర్థిస్తానని అయితే దానిలో లెబనాన్‌పై దాడులకు సంబంధించిన అంశం లేనందున దాడులు కొనసాగిస్తానని ఇజ్రాయిల్ ప్రకటించింది. మంగళవారం నాడు పాకిస్తాన్ జరిపిన సంప్రదింపులతో సంక్షోభానికి తాత్కాలిక విరామం లభించింది. అయితే లెబనాన్‌లోని హిజబుల్లా సాయుధులు, వారి అదుపులో ఉన్న ప్రాంతాలపై దాడులు కొనసాగితే ఇరాన్ ఏవిధంగా స్పందిస్తుందన్నది ఇది రాసే సమయానికి స్పష్టత రాలేదు. పోరు ఇంకా ముగియలేదని, తమ వేళ్లు ఇంకా ట్రిగ్గర్ మీదనే(తుపాకి గుండు బయటకు రావాలంటే నొక్కాల్సిన మీటను ట్రిగ్గర్ అంటారు) ఉన్నాయని ఇరాన్ ప్రకటించింది.ట్రంప్ ప్రకటన తరువాత రెండు వైపుల నుంచీ దాడుల వార్తలు లేవు. ఇరాన్ ప్రతిఘటనతో గుక్కతిప్పుకోలేని అమెరికా వ్యూహాత్మకంగా ఈ అవగాహనను అంగీకరించిందా? ఈలోగా తన బలగాలను మరింతగా కూడదీసుకుంటుందా అన్న అనుమానాలు లేకపోలేదు. ఎందుకంటే గతంలో ఏకపక్షంగా గడువులను ప్రకటించిన ట్రంప్ ఆ సమయంలో అన్ని రకాల దళాలను అదనంగా పశ్చిమాసియా, మధ్య ప్రాచ్యానికి తరలించి భూతల దాడులకు సన్నాహాలు చేశాడు. ఒక్క రాత్రితో ఇరాన్ నాగరికతను నాశనం చేస్తానని మాట్లాడిన సంగతి తెలిసిందే. అమెరికా-ఇజ్రాయిల్ దుష్ట ఆలోచన గురించి ఎలాంటి భ్రమలు లేనప్పటికీ ఎంతో సంయమనం, దూరదృష్టితో ఇరాన్ ప్రతిఘటన నిలిపివేతకు అంగీకరించింది. మధ్యవర్తిగా ఉన్న పాకిస్తాన్‌కు అమెరికా పదిహేను అంశాలు, ఇరాన్ పది ప్రతిపాదనలను అందచేశాయి. కాల్పుల విరమణ అమల్లోకి వచ్చిన తరువాత రెండువారాల వ్యవధిలో వీటి గురించి చర్చలు జరుగుతాయి. ఎవరు వేటిని అంగీకరిస్తారు, తిరస్కరిస్తారన్నది చర్చల ప్రారంభం తరువాతే తెలుస్తుంది.

**అమెరికా పదిహేను ప్రతిపాదనలు**

తక్షణమే నెల రోజుల కాల్పుల విరమణ జరగాలి, అన్ని చర్యలు నిలిపివేసి ముఖాముఖీ చర్చలు పాకిస్తాన్‌లో జరిపేందుకు అవకాశం కల్పించాలి. ఇరాన్‌లోని నాటంజ్, ఇష్ఫహాన్, ఫోర్డో అణుకేంద్రాలను శాశ్వతంగా ధ్వంసం చేయాలి. ఇరాన్ గడ్డమీద యురేనియం శుద్ధిని పూర్తిగా నిలిపివేయాలి.శుద్ధి చేసిన యురేనియం మొత్తాన్ని అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఏఇఏ) పర్యవేక్షణలో మరోదేశానికి తరలించాలి. ఇరాన్ లోని అన్ని మిలిటరీ, పౌరకేంద్రాలు ఎక్కడ ఉన్నప్పటికీ ఎప్పుడు పడితే అప్పుడు ఐఏఇఏ నిరాటంక తనిఖీకి అనుమతించాలి. హార్ముజ్ జలసంధిని తటస్త ప్రాంతంగా చేసి ఎలాంటి ఆటంకాలు లేకుండా స్వేచ్ఛగా నౌకా రవాణాకు అనుమతించాలి. బాలిస్టిక్ క్షిపణుల పరిధిని పరిమితం చేసి సంఖ్యను తగ్గించుకొని ఆత్మ రక్షణకు మాత్రమే వినియోగించాలి. హిజబుల్లా, హౌతీల వంటి సాయుధ బృందాలకు నిధులు, ఆయుధాల అందచేత నిలిపివేయాలి. నిర్బంధంలో ఉన్న విదేశీ పౌరులందరకీ, ద్వంద్వ పౌరసత్వం ఉన్న అందరికీ స్వేచ్ఛనివ్వాలి. అమెరికా ఆస్తులు, పొరుగున ఉన్న గల్ఫ్ దేశాలను లక్ష్యంగా చేసుకోకుండా ఒక ఒప్పందానికి రావాలి.సమగ్రమైన ఆంక్షల నుంచి ఊరట, ప్రాథమిక,ఇతర ఆంక్షలు పూర్తిగా తొలగింపు.విదేశాల నుంచి సేకరించే ఇంధనంతో బుషేహర్‌లో ఉన్న అణువిద్యుత్ కేంద్రానికి అమెరికా మద్దతు.ఇరాన్ ఇంధన రంగంలో పశ్చిమదేశాల పెట్టుబడులకు అవకాశం ఇవ్వాలి.ఒప్పందం కుదిరిన తరువాత ఆటోమేటిక్‌గా అమల్లోకి వచ్చే ఐరాస ఆంక్షల తొలగింపు.ప్రాంతీయ స్థిరత్వానికి చట్టపరమైన అంగీకారంతో శాశ్వత శాంతి ఒప్పందం.

**ఇరాన్ ప్రతిపాదించిన అంశాలు**


ఇరాన్ మీద ఇంకేమాత్రం దాడులు చేయకూడదు. అమెరికా, దాని అనుయాయి దేశాలు అన్ని రకాల దాడులను శాశ్వతంగా ఆపాలి.తాత్కాలిక విరమణ కాదు, శాశ్వత ఒప్పందం కుదరాలి.విదేశాల్లో స్తంభింపచేసిన ఇరాన్ ఆస్తులన్నింటినీ ఒప్పందంలో భాగంగా తిరిగి ఇవ్వాలి. లెబనాన్ మీద ఇజ్రాయిల్ దాడులను ఆపాలి. అన్ని రకాల అమెరికా ఆంక్షలను ఎత్తివేయాలి. ఇరాన్ అనుయాయుల మీద ఇంకేమాత్రం దాడులు జరపకూడదు. హార్ముజ్ జలసంధిలో స్వేచ్ఛగా నౌకా రవాణాకు అనుమతి. ప్రయాణించే ప్రతి నౌకకూ ఇరవై లక్షల డాలర్ల ఫీజు చెల్లించాలి. ఈ ఫీజులో ఒమన్‌కూ వాటా ఇస్తాం. దాడుల కారణంగా దెబ్బతిన్న తమ ఆస్తుల పునరు ద్ధరణకు ఈ ఫీజు ద్వారా సమకూడే సొమ్మును ఖర్చు చేస్తాం. అన్ని ఒప్పందాలకు ఐరాస భద్రతా మండలి తీర్మాన హామీ ఉండాలి. అయితే బుధవారం నాడు వచ్చిన కొన్ని వార్తల ప్రకారం అధికారిక పార్సీ భాషలో పేర్కొన్న ఒక కీలక అంశం విదేశీ మీడియా, ఇతరులకు ఆంగ్లంలో జారీచేసిన ప్రతిపాదనల్లో లేదని చెబుతున్నారు. యురేనియంను శుద్ధి చేసుకొనే హక్కు తమకు ఉండాలన్న అంశం పార్సీలో ఉందని అంటున్నారు.

**ట్రంప్ వెనక్కి తగ్గడానికి...**

ఎన్నో ప్రగల్భాలు పలికిన ట్రంప్ పాకిస్తాన్ తడిక రాయబారానికి ఎందుకు అంగీకరించాడన్నది చర్చ. అమెరికా సత్తా చూపుతాం, ఇరాన్‌లో పాలకులను గద్దె దింపుతామంటూ బయలుదేరిన ట్రంప్‌నే గద్దెదించాలని అమెరికాలో అధికార పార్టీకి చెందిన వారు కూడా కోరారు. దీన్నే విధి వైపరీత్యం అంటారు. అమెరికా కాలమానం ప్రకారం మంగళవారం రాత్రి ఎనిమిది గంటలలోగా తాను చెప్పినట్లుగా హార్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవకపోతే ఇరాన్ విద్యుత్ కేంద్రాలు, వంతెనలను పేల్చివేస్తామని ట్రంప్ బెదిరించాడు. ఒక్క రోజులో ఇరాన్‌ను ఆక్రమించుకోగలమని చెప్పాడు. తమ విద్యుత్ కేంద్రాల చుట్టూ మానవకవచాలుగా ఏర్పడాలని కవులు, కళాకారులు, యువకులు,యావత్ పౌరులకు ఇరాన్ ప్రభుత్వం పిలుపునిచ్చింది. వేలాది మంది జాతీయ పతాకాలతో గుమికూడారు. అమెరికా, ఇజ్రాయిల్ దుర్మార్గాల చరిత్రను చూసినపుడు నిరాయుధులైన పిల్లలు, మహిళలు, ఆసుపత్రుల్లోని రోగులు, సహాయ కేంద్రాలకు చేరిన అభాగ్యులు ఎవరినీ వదలకుండా చంపివేసిన దుర్మార్గాలు కోకొల్లలుగా కనిపిస్తాయి.

## రహస్యంగా ఇరాన్ అణు పరీక్ష!

### రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ మెద్వెదెవ్ వెల్లడి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**

ఇరాన్ రహస్యంగా అణ్వస్త్ర పరీక్ష జరిపిందని రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్, మాజీ ప్రధాని దిమిత్రీ మెద్వెదెవ్ బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. అత్యంత శక్తివంతమైన అణ్వాయుధ పరీక్షను ఇరాన్ నిర్వహించిందని ఆయన వెల్లడించారు.అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించిన ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ఈ సంచలన విషయాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాన సహాయకుడు దిమిత్రి ఎక్స్ పోస్టులో బయటపెట్టారు.


## ఏ క్షణమైనా.. మళ్లీ దాడులు : నెతన్యాహు



**జెరూసలేం, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**

యుద్ధాన్ని తాత్కాలికంగా విరమణ ప్రకటించిన తర్వాత.. 11 నుంచి ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య కీలక చర్చలు సాగబోతున్నాయి. అయితే, చర్చల ప్రక్రియకు విరుద్ధంగా ఇజ్రాయెల్ నుంచి ప్రకటనలు వెలువడుతున్నాయి.'యుద్ధానికి ఇది ముగింపు కాదు. ఏ సమయంలోనైనా మళ్లీ పోరుకు దిగుతాం' అని నెతన్యాహు బుధవారం రెచ్చగొట్టే ప్రకటనలు చేశారు. రెండువారాల పాటు తాత్కాలిక యుద్ధ విరమణ ఒప్పందాన్ని పాటిస్తామని, అయితే ఇరాన్‌కు వ్యతిరేకంగా ఏ సమయంలోనైనా దాడులకు తాము సిద్ధమని నెతన్యాహు అన్నారు.

## కిడ్నాప్ అయిన యూఎస్ జర్నలిస్ట్ విడుదల



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**

ఇరాక్‌లో కిడ్నాప్ అయిన అమెరికాకు చెందిన మహిళా ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షెల్లీ కిటెల్సన్ విడుదల అయ్యారు. ఈ విషయాన్ని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో ధ్రువీకరించారు. మార్చి 31న బాగ్దాద్‌లోని ఇరాక్ చెందిన మిలీషియా గ్రూపు సభ్యులు ఆమెను అపహరించారు. దీంతో ఆమె ఆచూకీ కోసం అక్కడి పోలీసులు, అమెరికా అధికారులు తీవ్రంగా శ్రమించారు. ఆమెను వెతకడంలో సహాయం చేసినందుకు ఇరాక్ అధికారులకు రూబియో ధన్యవాదాలు తెలిపారు.

## నెతన్యాహు దౌత్య వైఫల్యమే ఇది!

### ట్రంప్ ఏకపక్ష సీజ్‌ఫైర్‌పై ఇజ్రాయెల్‌లో విమర్శలు



**జెరూసలేం ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**

ఇజ్రాయెల్‌ను పరిగణనలోకి తీసుకోకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటించడం ఇజ్రాయెల్‌లో రాజకీయంగా దుమారం రేపింది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దౌత్యపరంగా, వ్యూహాత్మకంగా విఫలమయ్యారని విపక్ష పార్టీల నేతలు మండిపడ్డారు. 'నెతన్యాహు అహంకారం, నిర్లక్ష్యం, ప్రణాళిక లేకపోవటం వల్ల ఏర్పడిన నష్టమిది. దీనిని పూడ్చుకోవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది' అని విపక్ష నేత యైర్ లాపిడ్ విమర్శలు గుప్పించారు.మనదేశ చరిత్రలో ఇలాంటి రాజకీయ విపత్తు ఎన్నడూ సంభవించలేదు. జాతీయ భద్రతకు సంబంధించి కీలక నిర్ణయాలోను ఇజ్రాయెల్‌ను లెక్కలోకి తీసుకోలేదు. ఇదంతా ప్రధాని నెతన్యాహు దౌత్య వైఫల్యం వల్లే' అని అన్నారు. సైన్యం తన పనులన్నీ పూర్తిచేసిందని, ప్రజలు ఎంతో నిబ్బరాన్ని కనబర్చారని లాపిడ్ అన్నారు. అయితే, నెతన్యాహు నిర్దేశించుకున్న లక్ష్యాల్లో దేనినీ సాధించలేకపోయారని ఆయన అరోపించారు.

## ఇరాన్-అమెరికాల మధ్య కాల్పుల విరమణను స్వాగతిస్తున్నాం





**న్యూఢిల్లీ : ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**

ఇరాన్-అమెరికాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణను భారత్ స్వాగతించింది. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి కోసం "ఉద్రిక్తతలను తగ్గించాలి, చర్చలు, దౌత్యం" కోసం పిలుపునివ్వాలని సూచించింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. "కాల్పుల విమరణను మేము స్వాగతిస్తున్నాము. ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారితీస్తుందని ఆశిస్తున్నాము. మేము గతంలో, నిరంతరం స్పష్టం చేసినట్లుగా.. కొనసాగుతున్న సంఘర్షణలకు త్వరగా ముగింపు పలకడానికి ఉద్రిక్తతలను తగ్గించడం, చర్చలు, దౌత్యం చాలా అవసరం" అని ఆ ప్రకటనలో పేర్కొంది. "ఈ సంఘర్షణలతో ఇప్పటికే ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రపంచ ఇంధర సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగించింది. హార్ముజ్ జలసంధి నుండి నిరాటంకమైన నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ వాణిజ్య ప్రవాహం కొనసాగుతుందని మేము ఆశిస్తున్నాము" అని తెలిపింది.

# ఇజ్రాయిల్ బరితెగింపు

**-24 గంటల్లోనే లెబనాన్‌పై భీకర దాడి**
**-254 మంది మృతి**
**-హర్మూజ్‌ను మూసివేసిన ఇరాన్**



**బీరూట్-టెహ్రాన్ ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**

: అనుకున్నంతా జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం పరిధిలోకి లెబనాన్ రాదని వాదిస్తూ వచ్చిన ఇజ్రాయిల్ బరితెగించింది. ఒప్పందం కుదరిన 24 గంటల్లోనే లెబనాన్‌పై భీకర దాడికి దిగింది. బుధవారం రాత్రి పది నిమిషాల వ్యవధిలోనే లెబనాన్‌లోని పలు ప్రదేశాలపై వందకు పైగా వైమానిక దాడులు చేసింది. . ఇజ్రాయిల్ చేసిన ఈ భయానక దాడిలో 254 మంది మృతి చెందినట్లు 'ఆల్ జజీర' తెలిపింది. లెబనాన్ అధికారవర్గాలను ఉటంకిస్తూ ప్రచురించిన కథనంలో ఈ దాడుల్లో 1,165 మందికి పైగా గాయపడ్డారని, వీరిలో పలువురి పరిస్థితి ఆందోళన కరంగా ఉందని పేర్కొంది. దీంతో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మరోమారు మూసివేసింది. కాల్పుల విరమణ ఒప్పందానికి భిన్నంగా ఇజ్రాయిల్ చేసిన దాడులకు నిరసనగా జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. నిజా నికి అంతకు కొన్ని గంటల ముందే ఇరాన్ ఈ మేరకు ప్రకటించింది. బుధవారం ఉదయం నుండి లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రస్తావిస్తూ వాటిని కొనసాగిస్తే హర్మూజ్‌ను మూసివేసి, ఒప్పందం నుండి బయటకు వచ్చేస్తామని హెచ్చరించింది. అయితే, ఈ హెచ్చరికను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఇజ్రాయిల్ భీకర దాడులకు తెగబడింది. 1982 తరువాత లెబనాన్‌పై ఇదే అతి పెద్ద దాడి అని చెబుతున్నారు. దాడుల్లో లెబనాన్‌లోని ప్రముఖ మత పెద్ద సాదిక్ ఆలీ నబుల్సీ మరణించారు. లెబనాన్ రాజధాని బీరూట్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి.

# పాక్ కాదు.. డీల్ వెనుక చైనా

**-కాల్పుల విరమణకు చివరి నిమిషంలో దౌత్యం**
**-ఇరాన్‌తో నేరుగా మాట్లాడి ఒప్పించినట్లు వెల్లడి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**

కేవలం 10 గంటల వ్యవధిలో అమెరికా తన నిర్ణయం మార్చుకొని ఇరాన్‌తో కాల్పుల విరమణకు అంగీకరించింది. ఈ 10 గంటల్లో ఏం జరిగింది? రెండు వారాల కాల్పుల విరమణకు పాకిస్థాన్ పాత్రే కారణమని అమెరికా పేర్కొన్నప్పటికీ చివరి నిమిషంలో చైనా జోక్యమే ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిందని తెలుస్తున్నది. ఇరాన్‌పై చర్చలకు ఒత్తిడి తేవడంలో చైనా ప్రమేయం ఉందా అని అడిగినపుడు అవుననే అంటున్నాను అని ట్రంప్ ఏఎఫ్‌పీతో అన్నారు. ట్రంప్ విధించిన గడువు సమీపించడం, పూర్తి స్థాయి యుద్ధం జరిగే ప్రమాదం పొంచి ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో చైనా నేరుగా ఇరాన్‌తో చర్చలు జరిపినట్లు ఇద్దరు చైనా అధికారులను ఉటంకిస్తూ ఏపీ వార్తాసంస్థ తెలిపింది. దీన్ని బట్టి ఇరాన్‌పై పాకిస్థాన్ కన్నా చైనాకు ప్రత్యక్ష పట్టు ఉందని తెలుస్తున్నది. నిజానికి కాల్పుల విరమణ ఒప్పంద ప్రకటనకు కొన్ని గంటల ముందే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో హెర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడానికి బల ప్రయోగానికి అనుమతినిచ్చే ఒక తీర్మానాన్ని చైనా, ఇరాన్‌తో మరో మిత్రదేశమైన రష్యా కలిసి అడ్డుకున్నాయి. యూఎన్ తీర్మానం ఇరాన్ పట్ల వివక్షతతో కూడుకుని ఉందని చైనా పేర్కొన్నది.

# నూతన మోటార్ పంపు ఏర్పాటు.



**శిరివెళ్ళ. (డ్రీమ్ టైమ్స్)** మండల పరిధిలోని మహాదేవపురం గ్రామంలో ఎస్టీ కాలనీ యందు వాటర్ పంపు పనిచేయక పోవడంతో ఎస్టీ కాలనీవాసులు ఈ వేసవిలో మంచినీటి కోసం ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని గమనించిన మహాదేవపురం టిడిపి ఇన్చార్జ్ పి, ఎ, సి,య స్ డైరెక్టర్ వెలుగోడు మహేష్ తక్షణమే స్పందించి నూతనంగా వాటర్ మోటర్ పంపును ఏర్పాటు చేయడం జరిగిందని వారు తెలిపారు. అదేవిధంగా ఇప్పుడు ఉన్నటువంటి ఎండలు చాలా ఎక్కువగా ఉన్నాయని ప్రజలు ఈ వేసవిలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలను కాలవలకు, నీటి కుంటలకు, బావులకు, ఈత కొట్టడానికి వెళ్లకుండా తగిన జాగ్రత్తలు తమ పిల్లలపై శ్రద్ధ వహించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి యూత్ లీడర్ డి చిన్న, రమణ, బాలాజీ, ఖాదర్,తదితరులు పాల్గొన్నారు.

# వివాహ శుభకార్యంలో పాల్గొన్నచల్లా శ్రీలక్ష్మి



**బనగానపల్లె,ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
కర్నూలు పట్టణానికి చెందినా, శ్రీమతి ఉమ్మడి కృష్ణవేణి - శ్రీ ఉమ్మడి హుస్సేన్ రెడ్డి గారి కుమారుడి వివాహనికి ఈరోజు (08-04-2026) పట్టణంలోని గుత్తి రోడ్డులో గల G.R.C కన్వెన్షన్ హాల్, నందు స్వర్గీయ ఎమ్మెల్సీ శ్రీ చల్లా భగీరథ రెడ్డి సతీమణి శ్రీ చల్లా శ్రీలక్ష్మి హాజరవడం జరిగింది. అనంతరం కళ్యాణ మండపం చేరుకొని నూతన వధూవరులైన, సాయి వర్ధన్ రెడ్డి ఉ హర్షిత రెడ్డి, జంటను అక్షింతలు వేసి ఆశీర్వదించడం జరిగింది. అనంతరం హుస్సేన్ రెడ్డి కుటుంబ సభ్యులతో, బంధుమిత్రులతో, పరిచయాలు చేసుకొని మాట్లాడి, వారి అతిధి మర్యాదలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, చల్లా రాజ్యాభిషేక రెడ్డి, చల్లా శ్రీలక్ష్మి అనుచరులు, కార్యకర్తలు, , పాల్గొన్నారు.

# అమరావతి' ఆకారంలో విద్యార్థులు



**అలగడ్డ ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
అమరావతిని రాజధానిగా గుర్తిస్తూ రాష్ట్రపతి గెజిట్ విడుదల చేయడంపై ఆళ్లగడ్డ మండలం పడకండ్ల పాఠశాలలో హర్షం వ్యక్తమైంది. అపుస్మా డివిజన్ ప్రెసిడెంట్ అమీర్ బాషా ఆధ్వర్యంలో విద్యార్థులను 'అమరావతి' ఆకారంలో కూర్చోబెట్టి వినూత్నంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధాని, రాష్ట్రపతి, ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని తమ మద్దతును చాటారు.

# సబ్ జైల్లో తనిఖీ చేసిన సీనియర్ సివిల్ జడ్జి

**ఆళ్లగడ్డ ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ఆళ్లగడ్డ లోని ఉపకారాగరాన్ని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన జైలులోని ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదిని పెట్టుకునే స్తోమత లేని పేదలు కోరితే ఉచిత న్యాయ సౌకర్యాన్ని కూడా కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి భాస్కర్, జైలు సూపర్డెంట్ యోగేష్ కుమార్, అడ్వకేట్ బాబా ఫక్రుద్దీన్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అశోక్ కుమార్, సబ్ జైలు సిబ్బంది పాల్గొన్నారు.

# రేపటి నుండి జరిగే ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పాదయాత్రను జయప్రదం చేయండి.




**తనకల్లు ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
తనకల్లు ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 10 నుండి 12వ తేదీ వరకు అనంతపురం నుండి బండ్లపల్లి వరకు జరగబోయే పాదయాత్రను విజయవంతం చేయాలని సిపిఐ మండల నాయకులు కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విబి జీ రామ్ జి పథకం ద్వారా గ్రామీణ పేద కూలీలకు చిన్న సన్నకారు రైతులకు చాలా నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై 10% మాత్రమే భారం పడేదని కొత్త పథకం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులు భరించాల్సి వస్తుందన్నారు. ఉపాధి కూలీల రోజువారి వేతనం 270 రూపాయల నుండి 240కు తగ్గించడం ఏంటని ప్రశ్నించారు పల్లెల్లో వలసలు తగ్గి గ్రామీణ పేదల ఆర్థిక స్థితిగతులు మారాయన్నారు డాక్టర్ స్వామినాథం సిఫార్సుల అమలు గురించి ఉపన్యాసాలు తప్ప అమలు పరచడం లేదన్నారు వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉంది కాబట్టే రైతులతోపాటు కూలీలు కూడా 50 శాతానికి పైగా ఉపాధి హామీ పథకం పై ఆధారపడి ఉన్నారన్నారు ఆ పథకాన్ని నిర్వీర్యం చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కొత్త పథకాన్ని రూపొందించిందని దాన్ని రద్దు పరిచే వరకు పోరాటాలు తప్పవన్నారు. అనంతపురంలోని సమతా గ్రామ్ నుండి 10వ తేదీ పాదయాత్ర ప్రారంభించి 12వ తేదీ బండ్లపల్లిలో భారీ బహిరంగ సభ జరుగునున్నారు. మాజీ ఎమ్మెల్యే కే రామకృష్ణ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్ భారతీయ కేత్ మద్దూర్ యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా జాతీయ కార్యదర్శి నిర్మల్ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జల్లి విల్సన్ సిహెచ్ కోటేశ్వరరావు ఆవుల శేఖర్ లు పాదయాత్రలో పాల్గొంటారని రైతులు రైతు కూలీలు సిపిఐ పార్టీ అనుబంధ సంఘాలు సానుభూతిపరులు ప్రతి ఒక్కరూ పాదయాత్రలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సిపిఐ మండల కన్వీనర్ రెడ్డప్పసహాయ కార్యదర్శి రవి నాయకులు రెడ్డప్ప శ్రీనివాసులు వెంకటరమణ రవి నాయక్ తదితరులు గోడ పత్రికలు విడుదల చేసిన వారిలో ఉన్నారు.

# భద్రతలో ఎక్కడా రాజీ లేదు

## సీఎం టూర్‌కు ముందే పోలీసుల ట్రయల్ రన్



**బాపట్ల ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం వేమూరు నియోజకవర్గంలో పర్యటించనున్న నేపథ్యంలో బాపట్ల జిల్లా పోలీసులు భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆధ్వర్యంలో బుధవారం కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. సూరేపల్లి హెలిప్యాడ్ నుంచి ప్రారంభమైన కాన్వాయ్ ట్రయల్ రన్ వేమవరం మీదుగా ప్రజా వేదిక వరకు సాగి, అక్కడి నుంచి రైతుల పొలాలు, సమావేశ ప్రాంగణం వరకు కొనసాగింది. ప్రతి మార్గాన్ని స్వయంగా పరిశీలించిన ఎస్పీ, భద్రతా సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. కాన్వాయ్ ప్రయాణ సమయంలో ఎలాంటి అవాంతరాలు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని, ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొనే సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజా వేదికలు, ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వహించే అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సీఎం పర్యటనలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్త్ నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ పేర్కొన్నారు.

# వాటర్ ప్లాంట్ల ద్వారా సమస్యలు వస్తే చర్యలు తప్పవు

## ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ ఓబులేష్




**ఆత్మకూర్, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
పట్టణ ప్రజలకు మినరల్ వాటర్ ద్వారా ఎలాంటి సమస్యలు తలెత్తిన సంబంధిత ప్లాంట్ యజమాని పై కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ ఓబులేసు అన్నారు. సోమవారం పట్టణంలోని పలు మినరల్ వాటర్ ప్లాంట్ ను ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినరల్ వాటర్ యజమానులు పట్టణ ప్రజలకు పరిశుభ్రమైన సురక్షిత త్రాగునీటిని అందించాలన్నారు. మినరల్ వాటర్ ప్లాంట్ లో ఉపయోగించే నీటి ట్యాంకులు పరికరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి నీటి పరీక్ష నివేదికలను మున్సిపల్ కార్యాలయంలో సమర్పించాలని అన్నారు. మినరల్ వాటర్ ద్వారా ప్రజలకు ఎలాంటి సమస్యలు కలిసిన సంబంధిత వాటర్ ప్లాంట్ పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈయన వెంట మున్సిపల్ ఏఈ షాహిర్ భాష, సిబ్బంది తదితరులు ఉన్నారు.

# నారాయణలో గ్రాడ్యుయేషన్ డే..!



**ఎమ్మిగనూరు :- ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
ఎమ్మిగనూరు స్థానిక నారాయణ పాఠశాలలో క్లస్టర్ ప్రిన్సిపల్ అన్వర్ భాషా ఆధ్వర్యంలో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో పిపి-2 మరియు 5 వ తరగతి పూర్తి చేసుకుని ముందు తరగతులకు వెళ్ళుటకు విద్యార్థులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించి గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ లు అందచేసి వారి భవిష్యత్తుకు శుభాకాంక్షలు తెలిపారు. పాఠశాల విద్యార్థులలో విద్యతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తోందని అభినందించారు. విద్యార్థులు తర్వాత తరగతులు ఉత్సాహంగా వెళ్లి వాటి గురించి తెలుసుకోవాలని పదాల గురించి అక్షరాల గురించి వాఖ్యాల గురించి మరియు విలువలు గురించి అవగాహన కలిగి ఉండాలని ఇలాంటి విద్యాసంస్థలు సమాజానికి మంచి పౌరులను అందించడంలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం విద్యార్థులను ప్రోత్సహిస్తూ, ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకుని కృషి చేస్తే విజయం సాధ్యమవుతుందని పాఠశాల ప్రిన్సిపల్ సురేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ జాకీర్ హుస్సేన్, వైస్ ప్రిన్సిపాల్ లావణ్య, సౌజన్య డీన్ గిరి ప్రసాద్ కో ఆర్డినేటర్ ప్రియాంక, జైబ పాల్గొని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

# బాల్యవివాహాలపై కఠిన హెచ్చరిక

## -కోడుమూరులో ఐసిడిఎస్ అవగాహన కార్యక్రమం



**కోడుమూరు ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
కోడుమూరు పట్టణం లోని మోమిన్ వీధిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్వైజర్ రాజమ్మ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీడీఓ రాముడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాజాత బృందం ఆటపాటలతో ప్రజలను చైతన్య పరిచింది. 18 ఏళ్ల లోపు బాల బాలికలకు పెళ్లిళ్లు జరిపితే రెండేళ్ల జైలు శిక్షతో పాటు లక్ష రూపాయల జరిమానా విధిస్తారని అధికారులు హెచ్చరించారు. బాల్యవివాహాల వంటి దురాచారాన్ని నిర్మూలించేందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు నాగమ్మ, భాగ్యమ్మ, జానకి, సుజాత, అనురాధ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# 10వ తరగతి స్పాట్ వాల్యుయేషన్‌ను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి

-నంద్యాలలో 1.86 లక్షల సమాధాన పత్రాల మూల్యాంకనం
-భద్రతా ఏర్పాట్లపై కలెక్టర్ కీలక సూచనలు
-మార్కుల కేటాయింపులో అత్యంత జాగ్రత్త అవసరం: కలెక్టర్ ఆదేశాలు



**నంద్యాల,ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
నంద్యాల పట్టణ శివారు ప్రాంతంలోని ఎస్‌డీఆర్ స్కూల్‌లో నిర్వహిస్తున్న 10వ తరగతి పరీక్షల స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియను బుధవారం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వాల్యుయేషన్ కేంద్రంలో జరుగుతున్న పనితీరును పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. వివిధ జిల్లాల నుండి మొత్తం 1,86,489 మంది విద్యార్థుల సమాధాన పత్రాలు నంద్యాల జిల్లా కేంద్రానికి చేరుకున్నాయని డీఈఓ జనార్దన్ రెడ్డి కలెక్టర్‌కు నివేదించారు. ఈ నెల 6వ తేదీ నుండి 15వ తేదీ వరకు స్పాట్ వాల్యుయేషన్ ప్రక్రియ కొనసాగనుందన్నారు. ఈ వాల్యుయేషన్ కార్యక్రమంలో 76 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 440 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 220 మంది స్పెషల్ అసిస్టెంట్లు పాల్గొంటూ, మొత్తం 14 గదుల్లో సమాధాన పత్రాల మూల్యాంకనం జరుగుతోందని డీఈఓ వివరించారు. సమాధాన పత్రాల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మాత్రమే కాకుండా స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాల వద్ద కూడా తగిన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే, కేంద్రాల్లో త్రాగునీరు, లైటింగ్ తదితర మౌలిక సదుపాయాలు సమృద్ధిగా ఉన్నాయా లేదా అన్న విషయాలను జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ)ను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన సమాధాన పత్రాల మూల్యాంకనంలో ఎలాంటి నిర్లక్ష్యం లేకుండా, కొట్టివేతలు లేకుండా అత్యంత జాగ్రత్తగా మార్కులు కేటాయించాలని ఎగ్జామినర్లకు కలెక్టర్ స్పష్టం చేశారు.

# మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలి

**బనగానపల్లె, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని సిపిఐ మండల కార్యదర్శి శివయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు జి సంజీవులు డిమాండ్ చేశారు బుధవారం మండలంలోని ఫతేనగర్ గ్రామంలో ఉపాధి హామీ కార్మికులతో కలిసి వాల్పోస్టర్లు విడుదల చేశారు. సిపిఐ, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈనెల 10 నుండి 12వ తేదీ వరకు అనంతపురం నుండి బండ్లపల్లి వరకు జరిగే పాదయాత్ర పోస్టర్లను విడుదల చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం గ్రామీణ పేద కూలీలకు, చిన్న సన్నకారు రైతులకు అండగా ఉన్న మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేసిందని, దాని స్థానంలో ఎలాంటి హక్కులు లేనట్టి విబిజి రాంజీ పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటివరకు హక్కుగా పొందుతున్న ఉపాధిని పేదలు కోల్పోయే




పరిస్థితులు దాపురించాయని తెలిపారు. గతంలో కేంద్రం 90 శాతం నిధులు కేటాయిస్తుండగా 10% నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరించేది, నేడు రాష్ట్ర ప్రభుత్వం 40% ఖర్చు భరించాల్సి ఉన్నందున అనేక రాష్ట్ర ప్రభుత్వాలు చేతులెత్తేసె ప్రమాదం ఉందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఒకవైపు కార్పొరేట్లకు ఊడిగం చేస్తూ వారి ఆస్తులు పెంచుతూ మరో వైపు చట్టాలు మార్చి పేదల కడుపు కొట్టడానికి పూనుకున్నదని విమర్శించారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి ప్రభుత్వాలు మారిన గ్రామీణ ప్రజల బాధలు తగ్గడం లేదన్నారు. డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ సిఫార్సులు అమలు గురించి ఉపన్యాసాలు తప్ప అమలు గురించి ఆలోచించడం లేదని విమర్శించారు .మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తీయడమంటేనే గాంధీజీ అంటేనే ఏ భావన ఉందో ప్రజలు అర్థం చేసుకోవాలని తెలిపారు. దేశంలో మొట్టమొదట ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించిన బండ్లపల్లి గ్రామం వరకు జరిగే పాదయాత్రలో సిపిఐ జాతీయ కార్యదర్శి కె రామకృష్ణ , రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్య , రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ , సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జాఫర్ , భారతీయ కేతు మజ్దూర్ యూనియన్ గుల్జార్ సింగ్ గోరియా , జాతీయ కార్యదర్శి యస్ నిర్మల, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు అధ్యక్ష కార్యదర్శులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిహెచ్ కోటేశ్వరావు , ఆవుల శేఖర్ పాల్గొంటారని మండలం నుంచి అధిక సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొని పాదయాత్ర జయప్రదం చేయాలని కోరారు. ఈ గ్రామం క్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య మండల అధ్యక్షురాలు ఏలేశ్వరమ్మ ,ఉపాధి హామీ కార్మికులు పాల్గొన్నారు.

# పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరుపుతాం ..!

**- స్పెషలాఫీసర్ల సమీక్ష సమావేశంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**

**గుంతకల్లు, ఏప్రిల్,8(డ్రీమ్ టైమ్స్):**
అనంతపురం జిల్లా గుంతకల్లు మండలంలో పలు పంచాయతీల్లో వైసీపీ సర్పంచులు నిధులను వినియోగం చేసినట్లు తేటతెల్లమైంది. ఇందుకు సంబంధించి సమగ్ర విచారణ జరిపి తీరుతామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్పష్టం చేశారు. అవసరమైతే నాన్ బెయిలబుల్ కేసులు కూడా నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం గుంతకల్లు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో గుంతకల్లు నియోజకవర్గం పరిధిలోని గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాలకు చెందిన స్పెషల్ ఆఫీసర్లతో ఎమ్మెల్యే వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇందులో మండలంలోని పలువురు వైసిపి సర్పంచులు ఆయా పంచాయతీల్లో నిధులను దుర్వినియోగం చేసిన విషయం చర్చకు వచ్చింది. అంతేకాకుండా వైఎస్ఆర్ పంచులు నిధులను దిగ మింగినట్లు నిరూపణ కూడా అయిందన్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఎంపీడీవో, ఈవోపీఆర్డి గుంతకల్ రూరల్ పోలీస్ స్టేషన్లో సంబంధిత సర్పంచులపై ఫిర్యాదు కూడా చేశారన్నారు. నిధుల దుర్వినియోగానికి సంబంధించి సమగ్ర విచారణ చేయిస్తామన్నారు. అంతేకాకుండా నిధుల దుర్వినియోగానికి సంబంధించి ఇంకా వెలుగులోకి రాని వాటిపై



కూడా దృష్టి సారిస్తామన్నారు.
.సర్పంచ్ పదవీకాలం ముగిసిన అనంతరం గ్రామ పంచాయతీల నిర్వహణ కోసం నియమించబడిన స్పెషల్ ఆఫీసర్లు వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో ఏప్రిల్, మే నెలల్లో తాగునీటి కొరత తీవ్రంగా ఉండే అవకాశం ఉన్నందున, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, వీధి దీపాలు, డ్రైనేజీ వ్యవస్థ వంటి ప్రాథమిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్పెషల్ ఆఫీసర్లు గ్రామాభివృద్ధి పనులను సమర్థంగా అమలు చేయాలని, ప్రభుత్వ నిధులను సరైన విధంగా వినియోగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.క్రమశిక్షణతో పనిచేస్తే భవిష్యత్తులో గౌరవం, గుర్తింపు లభిస్తుందని ప్రోత్సహించారు. అలాగే ఐదు పంచాయతీలలో సర్పంచ్ పదవీకాలం ముగిసిన తరువాత కొందరు మాజీ సర్పంచ్‌లు ప్రభుత్వ నిధులను దుర్వినియోగం చేసినట్లు పేర్కొన్నారు.రూ.5 లక్షల నుంచి రూ.13 లక్షల వరకు ఉన్న పంచాయతీ నిధులను అభివృద్ధి పనులకు వినియోగించకుండా స్వప్రయోజనాలకు మళ్లించినట్లు తెలిపారు.సంబంధిత సర్పంచులపై విచారణ చేపట్టినట్లు తెలిపారు. నిధుల దుర్వినియోగం పై కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ నిధులు ప్రజల అభివృద్ధి కోసం మాత్రమే వినియోగించాల్సినవని, ఎలాంటి అవకతవకలు సహించబోమని స్పష్టం చేశారు. ఈ సమీక్ష సమావేశంలో గుంతకల్లు డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్ విజయలక్ష్మి తదితర ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నేటి పొదుపే రేపటి భవిష్యత్తు బాట



**బనగానపల్లె, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
నేటి పొదిపే రేపటి భవిష్యత్తుకు బాట అని శ్రీ జే కే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జె ఎస్ ఎస్ బ్రహ్మానంద ఆచారి పేర్కొన్నారు బుధవారం మండలంలోని పలుకూరు గ్రామంలోని సచివాలయంలో శ్రీ జే కే ఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జె ఎస్ ఎస్ బ్రహ్మానంద చారి ఆధ్వర్యంలో పొదుపు రేపటి భవిష్యత్తు బాట కరపత్రం విడుదల చేసి పంపిణీ చేశారు. పొదుపుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మానంద ఆచారి మాట్లాడుతూ నేటి పొదుపే రేపటి భవిష్యత్తు బాటని డబ్బులు పొదుపు చేస్తే ఆర్థిక, ఆరోగ్య అవసరాలు, అత్యవసర పరిస్థితుల్లో డబ్బు ఉపయోగ పడుతుందన్నారు. దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే గ్యాస్, విద్యుత్తు, పెట్రోలు, మంచినీరు, ఇంధన వనరులను పొదుపు చేసి దేశాభివృద్ధికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.వెలుగు ఏపీఎం ఎం ఉస్మాన్ హాజరత్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పొదుపుతూనే ఆర్థిక అభివృద్ధి సాధ్యమన్నారు. మహిళలకు ప్రత్యేక లోన్స్ సౌకర్యం కూడా కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి మేము కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బనగానపల్లె ఏపిఎం ఎం ఉస్మాన్ హాజరత్, వెలుగు సి సి లు రామ సుంకడు, నరసయ్య, కవితా, సుమతి, మహేశ్వరి, పొదుపు లక్ష్మి మహిళలు పాల్గొన్నారు.

# పట్టణంలో 50 లక్షల తో తాగునీటి పైప్ లైన్ పనులు



**బనగానపల్లె, ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
బనగానపల్లె పట్టణంలో 50 లక్షల రూపాయలతో తాగునీటి పైప్ లైన్ పనులు చేస్తున్నట్లు ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సాయి కృష్ణ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆర్డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఏఈ సాయి కృష్ణ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో నబాబుల కాలం నాటి డ్రైనేజీ పనులను మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి ఆధునికరిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలో రూ 33 కోట్లతో అండర్ డ్రైనేజీ పనులు చేస్తున్నారని, అండర్ డ్రైనేజీ కాలువలు చేస్తున్న ప్రాంతాలలో పాత పైపులను తొలగించి కొత్త పైపు లైన్లు వేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని పెద్ద పీర్ల చావిడి, బీసీ కాలనీ ,నాయక్ వాడా వీధి, కూరగాయల మార్కెట్ లైన్, కరింబాగ్, జంగ్లీ మసీదు ఏరియా, నాయి బ్రాహ్మణ కాలనీ, బీసీ గుర్రె రెడ్డి కాలనీ, ఖాజీవాడ, బుడగ జంగాల కాలనీ, కరణం మోదిన్ కాలనీ ,లాల్ మసీదు ఏరియా, చక్రవర్తి టాకీస్ ఏరియా, కొత్త బస్టాండ్ ప్రాంతం, మంగళవారం పేటలోని ఎస్సీ కాలనీ, దాసరి పేట లలో రూ 50 లక్షల రూపాయలతో నూతన పైప్ లైన్ పనులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పట్టణంలో అండర్ డ్రైనేజీ జరిగే ప్రాంతాలలో కొత్త పైప్ లైన్ వేస్తు ఇంటికి కొళాయి కనెక్షన్ ఇస్తున్నట్లు తెలిపారు. రంగరాజుపేట, పటాన్ వీధులలో ప్రస్తుతం అండర్ డ్రైనేజీ పనులు జరుగుతున్నాయని, ఆ ఏరియాలలో నూతన పైపులైను త్వరలో వేయనున్నట్లు తెలిపారు. రింగ్ రోడ్డు పనులు జరిగే ప్రాంతాల్లో స్కీం పైప్ లైన్లను మారుస్తున్నట్లు తెలిపారు. రింగ్ రోడ్డు పనుల వల్ల పగిలిపోయిన వాటర్ స్కీం పైపులను మారుస్తున్నట్లు ఏఈ తెలిపారు.

# మల్లన్న సేవలో..తెలంగాణ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ..



**శ్రీశైలం ఏప్రిల్ 8 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
శ్రీ భ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను తెలంగాణ రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించుకున్నారు. స్వామివార్ల దర్శనార్థమై బుధవారం ఉదయం ఆలయరాజగోపురం వద్దకు విచ్చేసిన మంత్రికి కార్యనిర్వాహణాధికారి యం శ్రీనివాసరావు, ఆలయ అధికారులు అర్చకవేదపండితులు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. మంత్రి స్వామివారికి అభిషేకాదిఅర్చనలు,అమ్మవారికి విశేషాకుంకుమార్చనాది పూజలు నిర్వహించుకున్నారు.పూజలనంతరం అమ్మవారి అలయప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో మంత్రి కొండా సురేఖ కుటుంబసభ్యులకు అర్చక,వేదపండితులు వేద ఆశీర్వచనాలు వల్లించగా కార్యనిర్వాహణాధికారి యం. శ్రీనివాసరావు, ధర్మకర్తల మండలి సభ్యులు స్వామివార్ల జ్ఞాపికను,లడ్డు ప్రసాదములను అందజేశారు.


# బిజినెస్

# భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్..
# ఒక్క రోజే రూ.17 లక్షల కోట్ల లాభం



ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం భారతీయ స్టాక్ మార్కెట్‌కు లాభాలపంట పండించింది. ఇన్వెస్టర్లకు భారీ లాభాలు తెచ్చిపెట్టింది. బుధవారం, ఎస్ అండ్ పీ బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 2,946.32 పాయింట్లు లాభపడి, 77,562.90 పాయింట్ల వద్ద ముగిసింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా ఏకంగా 873.35 పాయింట్లు పెరిగి, 23,997.35 పాయింట్ల వద్ద ముగిసింది. ఏకంగా ఈ ఒక్కరోజే 4 శాతం లాభాలతో మదుపర్ల సంపద రూ.17.1 లక్ష కోట్ల వరకు పెరిగింది.దీంతో మొత్తం మార్కెట్ విలువ రూ.445.8 లక్షల కోట్లకు చేరింది. ఉదయం ప్రారంభం నుంచి మార్కెట్ లాభాల్లోనే నడిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 77,627.15 కోట్ల గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 24,025.15 పాయింట్ల గరిష్ట స్థాయికి చేరింది. ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గనుండటం వంటి పరిణామాలు మార్కెట్‌కు అనుకూలంగా మారాయి. అలాగే, కీలక వడ్డీ రేట్లను ఆర్బీఐ యథాతథంగా ఉంచడం కూడా కలిసొచ్చింది. ఇండియన్ మార్కెట్‌తోపాటు అంతర్జాతీయ మార్కెట్లు కూడా ఈ రోజు లాభాలబాటపట్టాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి 6 శాతం, జపాన్ నిక్కీ 5 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 3 శాతం లాభాపడ్డాయి.మరోవైపు డాలర్‌తో రూపాయి మారక విలువ 47 పైసలు పెరిగి, 92.59 వద్ద కొనసాగుతోంది. కాల్పుల విరమణ ఒప్పందంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా భారీగా తగ్గిపోయాయి. అంతకుముందు రోజు బ్యారెల్ క్రూడాయిల్ ధర దాదాపు 109 డాలర్ల వద్ద ఉండగా, బుధవారం భారీగా తగ్గి 94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దాదాపు 16 శాతం పైగా చమురు ధర తగ్గింది. ఔన్స్ బంగారం ధర 4788 డాలర్ల వద్ద స్థిరపడింది. ఈ రోజు షేర్లలో ఇండిగో ఏకంగా పది శాతం మేర లాభాలు పొందింది.

## మళ్లీ షాకిచ్చిన బంగారం ధరలు..



బంగారం ధరలు ఊహించని షాకిచ్చాయి. గంటల వ్యవధిలోనే ధరలు మారాయి. ఇరాన్‌తో యుద్ధానికి విరామం ఇస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన క్రమంలో పసిడి ధరల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇరాన్ కూడా యుద్ధానికి గ్యాప్ ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో గోల్డ్, సిల్వర్ రేట్లల్లో భారీగా హెచ్చుతగ్గులు నమోదువుతున్నాయి. బుధవారం గోల్డ్ రేట్లు ఒక్కసారిగా పెరిగాయి.ప్రస్తుతం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,820 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.1,49,840 వద్ద స్థిరపడింది. అంటే నిన్నటితో పోలిస్తే ఇవాళ ఒక్కరోజే రూ.3980 పెరిగింది. అటు 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,41,000 వద్ద కొనసాగుతోంది. నిన్న ఇదే ధర రూ.1,37,350 వద్ద కొనసాగింది. ఇవాళ ఏకంగా రూ.3650 పెరిగిందని చెప్పవచ్చు.ఇక విజయవాడ, విశాఖపట్నంలో కూడా పై ధరలు కొనసాగుతున్నాయి. ఇక చెన్నైలో ఇవాళ రూ.1,51,190 వద్ద ఉన్నాయి. నిన్న రూ.1,51,200 వద్ద స్థిరపడ్డాయి. ఇక 22 క్యారెట్ల ధర అక్కడ రూ.1,38,590గా ఉండగా.. నిన్న రూ.1,38,600గా ఉంది. అటు బెంగళూరులో 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ ధర రూ.1,53,820గా ఉండగా.. 22 క్యారెట్ల రేట్లు చూస్తే రూ.1,41,000 వద్ద ఉన్నాయి.ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,970 వద్ద ఉండగా.. నిన్న ఇవే ధరలు రూ.1,49,990 వద్ద స్థిరపడ్డాయి. ఇక 22 క్యారెట్ల రేటు నిన్న రూ.1,37,500 వద్ద ఉండగా.. బుధవారం రూ.1,41,150 వద్ద కొనసాగుతున్నాయి. ఇక సిల్వర్ రేట్లు కూడా భారీగా పెరిగాయి.ఢిల్లీలో కేజీ సిల్వర్ ధర ప్రస్తుతం రూ.2.60 లక్షలుగా ఉంది. ఇది నిన్న రూ.2.50 లక్షలుగా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.10 వేలు పెరిగింది. ఇక హైదరాబాద్‌లో కేజీ వెండి రూ.2,54,900గా ఉండగా.. మంగళవారం రూ.2.55 లక్షలుగా ఉంది. ఇక చెన్నైలో కూడా రూ.2.54 లక్షల వద్ద ఉంది.

## టయోటా కార్లు ప్రియం



**న్యూఢిల్లీ,**
టయోటా సంస్థ వాహన కొనుగోలుదారులకు షాకిచ్చింది. అన్ని రకాల మాడళ్ల ధరలను రూ.2.16 లక్షల వరకు పెంచుతున్నట్టు ప్రకటించింది. దీంతో ఫార్చ్యూనర్, ఇన్నోవా, హైరైడర్, గ్లాంజా, టైసర్, హిలక్స్, ఎల్‌సీ 300 మాడళ్లు రెండు శాతం వరకు పెంచిందిపెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయని పేర్కొంది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఇన్నోవా క్రైస్టా రూ.39 వేల వరకు అధికం కానుండగా, ఫార్చ్యూనర్ రూ.69 వేలు, ఇన్నోవా హైక్రాస్ రూ.54 వేల వరకు, అర్బన్ క్రూజర్ హైరైడర్ రూ.5 వేల వరకు, గ్లాంజా రూ.20 వేలు, టైసర్ రూ.22 వేలు, హిలక్స్ రూ.56 వేలు, ల్యాండ్ క్రూజర్ 300 రూ.2.16 లక్షల వరకు ప్రియంకానున్నాయి.

# స్పోర్ట్స్

## బుమ్రానే వణికించిన వైభవ్ సూర్యవంశీ




ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో జరిగిన రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో యువకెరటాలు సంచలనం సృష్టించారు. రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ విధ్వంసకర బ్యాటింగ్ చేశారు. సీనియర్ పేసర్లకు కూడా ఎలాంటి గౌరవం లేకుండా బౌండరీలు బాదేస్తూ అందర్నీ ఆశ్చర్యానికి గురిచేశారు. తొలుత వర్షం కారణంగా నిన్న ఐపీఎల్‌లో రాజస్థాన్, ముంబై మధ్య జరిగిన మ్యాచ్‌ను 11 ఓవర్లకు అంపైర్లు కుదించారు. ఈ మ్యాచ్‌లో 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ.. విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పుడు అతడి ప్రదర్శనపై తెగ చర్చ జరుగుతోంది. టీమ్ఇండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లోనూ తొలి బంతికే వైభవ్ అవలీలగా సిక్సర్‌గా మరల్చడం పట్ల అందరి దృష్టిని ఆకర్షించాడు. తొలి బంతికే సిక్సర్ కొట్టిన విధానం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. గౌహతి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. బుమ్రా వేసిన తన మొదటి బంతిని ఎదుర్కొన్న సూర్యవంశీ ఏమాత్రం సంకోచించలేదు. అతను ఆరంభంలోనే ఒక స్లాట్ డెలివరీని అంచనా వేసి, దానిని లాంగ్-ఆన్ మీదుగా సిక్సర్‌గా మరల్చాడు. క్షణాల్లోనే ఆ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. టీమ్ఇండియా పేసర్ బుమ్రా ఏమాత్రం కనికరం లేకుండా ఆడిన తొలి ఇన్నింగ్స్ ఇదే అని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.
వైభవ్ సూర్యవంశీ ప్రదర్శన రాజస్థాన్ రాయల్స్ జట్టు గెలుపులో కీలకంగా మారింది. రాజస్థాన్ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ రన్‌రేట్‌ను భారీగా పెంచడంతో ఇద్దరూ కృషి చేశారు. అయితే బుమ్రా బౌలింగ్‌లో ఏకంగా రెండు సిక్సర్లు బాది సూర్యవంశీ ఆటతో అందర్నీ ఆకట్టుకున్నాడు. ఆ విధంగా బుమ్రా బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో ఏకంగా 12 పరుగుల రాబట్టాడు. అయితే వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లో 39 పరుగులు రాబట్టాడు. అందులో 5 సిక్సర్లు, 1 ఫోర్ ఉంది. అయితే శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో లాంగ్‌ఆన్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అయితే యశస్వి జైస్వాల్.. ఆడిన 32 బంతుల్లో 77 పరుగులు చేసి రాజస్థాన్ రాయల్స్ గెలుపులో కీలక మలుపుగా మారాడు. వీరిద్దరి భాగస్వామ్యం కేవలం 5 ఓవర్లలో 80 పరుగులు రాబట్టారు.

## ధోనీ రాకపై కోట్లాది మంది ఫ్యాన్స్ ఎదురుచూపు



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న సీఎస్కే అభిమానులకు ధోనీ రాకపై నిరాశే ఎదురవుతోంది. ప్రస్తుత సీజన్లో జట్టు పేలవ ప్రదర్శన కనబరుస్తుండటంకో అందరి దృష్టంతా ఎంఎస్ ధోనీ ఫిట్‌నెస్‌పైనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ ధోనీ లభ్యత గురించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. గత 3 మ్యాచ్‌ల్లో వరుసగా ఓడిపోయిన సీఎస్కేకు ధోనీ లేకపోవడం పెద్ద లోటుగా కనిపిస్తోంది. 44 ఏళ్ల ఈ దిగ్గజ ఆటగాడు ఎప్పుడు మైదానంలోకి వస్తాడా అని కోట్లాది మంది ఫ్యాన్స్ ఆశగా ఎదురుచూస్తున్నారు.సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ధోనీ ఇంకా తన గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. "ఎంఎస్ ధోనీ కోలుకునే ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది.. అయితే ధోనీ మైదానంలోకి వచ్చే ఖచ్చితమైన సమయాన్ని ఇప్పుడే చెప్పలేమని.. దీనికి మరికొన్ని రోజులు పట్టవచ్చని సీఎస్కే సీఈవో చెప్పుకొచ్చారు. ప్రీ-సీజన్ క్యాంపులో ధోనీ మోకాలికి గాయమైందని.. అందుకే ఆయన ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదని సమాచారం. సీఎస్కే సీఈవో ప్రకటన ధోనీ రావడానికి మరింత ఆలస్యం కావచ్చని తెలుస్తోంది. ఇది సీఎస్కే అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది.ఎంఎస్ ధోనీ అందుబాటులో లేకపోయినప్పటికీ.. మరో కీలక ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్ రీఎంట్రీపై జట్టు ఆశాభావంతో ఉంది. దక్షిణాఫ్రికాకు చెందిన ఈ యువ బ్యాటర్ గాయం కారణంగా గత కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే డెవాల్డ్ బ్రెవిస్ వేగంగా కోలుకుంటున్నాడని.. తదుపరి మ్యాచ్ లో డెవాల్డ్ బ్రెవిస్ తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉందని సీఎస్కే సీఈవో వెల్లడించారు. గత సీజన్లో డెవాల్డ్ బ్రెవిస్ 180 స్ట్రైక్ రేట్‌తో అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన చేయడంతో బ్రెవిస్ రాక జట్టు మిడిలార్డర్‌కు బలాన్ని ఇస్తుందని జట్టు యాజమాన్యం భావిస్తోంది. సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా డెవాల్డ్ బ్రెవిస్ రాకపై సానుకూలంగా స్పందించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. బ్రెవిస్ తదుపరి పోరులో అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. వరుస పరాజయాలతో పాయింట్ల పట్టికలో వెనుకబడిన చెన్నై సూపర్ కింగ్స్, ధోనీ లేని లోటును పూడ్చుకుంటూ తిరిగి విజయాల బాట పట్టాలని ప్రయత్నిస్తోంది. ఏది ఏమైనా, "తలా" ధోనీ మైదానంలో ఎప్పుడు కనిపిస్తాడనే ఉత్కంఠ మాత్రం కొనసాగుతూనే ఉంది.

## సత్తా చాటుతున్న సందీప్ శర్మ



ఐపీఎల్ 2026లో ఉత్కంఠ మ్యాచ్ లు జరుగుతున్నాయి. కొంతమంది బ్యాటర్లు, మరికొంతమంది బౌలర్లు తమ సత్తా చాటుతూ అటు పరుగులు, ఇటు వికెట్లు కొల్లకొడుతున్నారు. ఈ క్రమంలో ఓ ప్లేయర్ మాత్రం తనమైన శైలిలో స్టార్ ప్లేయర్లకు వరుసగా షాక్ లు ఇస్తూ దూసుకెళు న్నాడు. ఈ 32 ఏళ్ల ప్లేయర్ వచ్చిన అవకాశాలను సక్రమంగా వినియోగించుకుంటూ కీలక మ్యాచ్ ల్లో వికెట్లు తీస్తూ సత్తా చాటుతున్నాడు. అయితే, ఈ ప్లేయర్ కు భారత జట్టు తరపున ఆడే అవకాశాలు చాలా తక్కువగా వచ్చాయి. కానీ, ఐపీఎల్ లో మాత్రం తన దూకుడు చూపిస్తూ స్టార్ ప్లేయర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. ఈ ప్లేయర్ ఎవరో అని ఆలోచిస్తున్నారా.. ఆయన పేరు సందీప్ శర్మ.సందీప్ వర్మ ఇప్పటి వరకు ఐపీఎల్ లో మూడు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తంగా 140 మ్యాచ్ లు ఆడి 149 వికెట్లు పడగొట్టాడు. కాగా, ఈ వికెట్లలో చాలా వరకు స్టార్ ప్లేయర్లవే ఉండడం గమనార్హం. వాళ్ల వికెట్లు తీయడం సందీప్ శర్మకు వెన్నతో పెట్టిన విద్యలా మారింది.సందీప్ శర్మ తీసిన పెద్ద పేర్లలో విరాట్ కోహ్లీ ముందున్నాడు. ఐపీఎల్ లో అత్యధిక పరుగులు చేసిన విరాట్ కోహ్లీ పాలిట విలన్ లా మారాడు. ఆ తర్వాత లిస్ట్ లో రోహిత్ శర్మ, క్రిస్ గేల్, సూర్యకుమార్ యాదవ్ లుఉన్నారు. ఆ తర్వాత లిస్ట్ లో శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్ వంటి ఆటగాళ్లు ఉన్నారు.విరాట్ కోహ్లీని 7 సార్లు పెవిలియన్ చేర్చిన సందీప్ శర్మ. ఆ తర్వాత రోహిత్ శర్మను 6సార్లు ఔట్ చేశాడు. ఇక క్రిస్ గేల్, సూర్యకుమార్ యాదవ్ లను నాలుగుసార్లు ఔట్ చేశాడు. శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్ లను తలో మూడు సార్లు ఔట్ చేశాడు. అయితే, ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏంటంటే, సందీప్ శర్మ అత్యధికసార్లు ఔట్ చేసిన ఆటగాళ్లంతా టాప్ ఆర్డర్ లోనే ఉండడం గమనార్హం.



# ఇకపై సింగిల్‌గానే ఉంటా!

ప్రేమ, పెళ్లి విషయాల్లో తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వ్యక్తం చేస్తుంటుంది అగ్ర కథానాయిక శృతిహాసన్. గతంలో డూడుల్ ఆర్టిస్టు శంతను హజారికాతో సుదీర్ఘ ప్రేమాయణం నడిపిందీ భామ. వారిద్దరూ పెళ్లిపీటలెక్కబోతున్నారనే వార్తలు కూడా వచ్చాయి. అయితే అనంతర పరిణామాల్లో ఈ జంట విడిపోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం నటనపై దృష్టి పెట్టింది శృతిహాసన్. సెలెక్టివ్‌గా సినిమాల్ని ఎంచుకుంటున్నది. తాజా ఇంటర్వ్యూలో ఆమె తన బ్రేకప్ స్టోరీని పంచుకుంది. తాను ఇప్పటివరకు ఆరుసార్లు విఫల ప్రేమ అనుభవాల్ని చవిచూశానని, వాటివల్ల మానసిక సంఘర్షణకు లోనయ్యానని చెప్పింది. ప్రస్తుతం సినిమాలే ప్రపంచంగా ప్రశాంత జీవితం గడుపుతున్నానని, ఇక మీదట తాను ఒంటరిగానే ఉంటానని శృతిహాసన్ తెలిపింది. ప్రస్తుతం ఆమె మాటలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి.




# అల్లు అర్జున్ మూవీ పేరు రాకా !

## టైటిల్ రిలీజ్ చేసిన చిత్ర బృందం

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే గిఫ్ట్ అందింది. తమిళ స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో బన్నీ చేయబోతున్న భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ టైటిల్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఈ చిత్రానికి 'రాకా' అనే పవర్ ఫుల్ టైటిల్‌ను ఖరారు చేస్తూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. విడుదలైన పోస్టర్‌లో అల్లు అర్జున్ మునుపెన్నడూ చూడని విభిన్నమైన అవతారంలో కనిపిస్తున్నారు. గుండుతో, కళ్లకు కాటుక పెట్టుకుని, ఒంటిపై వింత ఆకృతులతో ఉన్న ఈ లుక్ చూస్తుంటే ఆయన ఏదో 'వేర్-బీస్ట్' (జంతువుగా మారే మనిషి) తరహా పాత్రలో నటిస్తున్నట్లు తెలుస్తోంది. 'జవాన్' వంటి సెన్సేషనల్ హిట్ తర్వాత అట్లీ తెరకెక్కిస్తున్న చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు ఉన్నాయి. ఇందులో బాలీవుడ్ స్టార్ నటి దీపికా పదుకొణె హీరోయిన్‌గా నటిస్తుండటం విశేషం. ఆమె ఈ చిత్రంలో ఒక వీరనారి పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. సన్ పిక్చర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం సుమారు 800 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో, అత్యాధునిక ÷ఎఈచీ హంగులతో రూపొందుతోంది. హాలీవుడ్ టెక్నీషియన్లు కూడా ఈ ప్రాజెక్ట్ కోసం పని చేస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం సహా 7 భాషల్లో 2027 వేసవిలో విడుదల చేసేందుకు చిత్రబృందం ప్లాన్ చేస్తోంది. 'విజన్ బియాండ్ లిమిట్స్' హద్దులు లేని ఊహ అనే ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# నాకు బ్రేకప్ అయ్యింది..

## మా అమ్మకు కూడా అది తెలుసు.. షాకింగ్ విషయం చెప్పిన కృతిశెట్టి

ఉప్పెన సినిమాతో తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకుంది ముద్దుగుమ్మ కృతిశెట్టి. తొలి సినిమాతోనే సెన్సేషన్ గా మారిన ఈ చిన్నది ఆతర్వాత వరుసగా అవకాశాలు అందుకుంది. అలాగే బ్యాక్ టు బ్యాక్ మూడు హిట్స్ అందుకుంది. ఉప్పెన సినిమా తర్వాత కృతిశెట్టి నటించిన బంగార్రాజు సినిమా మంచి హిట్ గా నిలిచింది. ఆతర్వాత నానితో కలిసి శ్యామ్ సింగరాయ్ సినిమాలో నటించింది. ఈ మూవీ కూడా మంచి విజయాన్ని అందుకుంది. దాంతో ఈ చిన్నది టాలీవుడ్ లక్కీ బ్యూటీగా మారిపోయింది. కానీ ఆతర్వాత సీన్ రివర్స్ అయ్యింది.. ఈ బ్యూటీ చేసిన సినిమాలన్నీ వరుసగా ఫ్లాప్ అయ్యాయి. వరుసగా యంగ్ హీరోల సరసన సినిమాలు చేసింది. కానీ ఆ సినిమాలన్నీ బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టాయి. దాంతో కృతిశెట్టి సినిమాల స్పీడ్ తగ్గించేసింది. తెలుగులో పెద్దగా ఆఫర్స్ అందుకోలేకపోయింది. ప్రస్తుతం తమిళ్, మలయాళ సినిమాలో నటిస్తుంది ఈ చిన్నది. ఈ క్రమంలోనే ఇప్పుడు ప్రదీప్ రంగనాథ్ తో కలిసి లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ అనే సినిమాలో నటిస్తుంది. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇదిలా ఉంటే ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా కృతిశెట్టి చేసిన కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. తన లైఫ్ లో ప్రేమ, బ్రేకప్ గురించి మాట్లాడుతూ.. తాను ప్రస్తుతం సింగిల్‌గానే ఉన్నానని తెలిపింది కృతి. అయితే ఓసారి బ్రేకప్ అయ్యిందని తెలిపింది. ఈ విషయం మా అమ్మకు కూడా తెలుసని కృతి శెట్టి చెప్పుకొచ్చింది. అదేవిధంగా తనపై నెగిటివ్ కామెంట్స్ చేస్తే సోషల్ మీడియాలో బ్లాక్ చేస్తా అని తెలిపింది కృతి.





# పాజిటివ్ టాక్‌తో దూసుకు పోతున్న బైకర్

టాలీవుడ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'బైకర్' బాక్సాఫీస్ వద్ద అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. భారతదేశపు మొట్టమొదటి మోటోక్రాస్ స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా, విడుదలైన ఐదు రోజుల్లోనే ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచే స్థాయిలో వసూళ్లు రాబడుతోంది. సాధారణంగా ఏ సినిమా అయినా వీక్‌డేస్‌లో కలెక్షన్లు తగ్గుముఖం పడతాయి. కానీ 'బైకర్' విషయంలో మాత్రం పరిస్థితి పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. రోజు రోజుకూ ఈ సినిమా పుంజుకుంటూ ముందుకు దూసుకెళ్తోంది. ముఖ్యంగా ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ మౌత్ టాక్ ఈ చిత్రానికి పెద్ద ప్లస్‌గా మారింది. ఆన్‌లైన్ బుకింగ్స్ కూడా ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేస్తున్నాయి. సోమవారం రోజు బుక్‌మైషోలో సుమారు 15.6 వేల టిక్కెట్లు అమ్ముడవ్వగా, మంగళవారం ఈ సంఖ్య 17.2 వేలకు పెరగడం విశేషం. భారీ పోటీ ఉన్నప్పటికీ, ప్రేక్షకులు ఈ హై-ఓల్టేజ్ యాక్షన్ స్పోర్ట్స్ డ్రామాపై చూపిస్తున్న ఆసక్తి సినిమా విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ చిత్రాన్ని దర్శకుడు అభిలాష్ రెడ్డి కంకర తెరకెక్కించగా, ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించింది. సినిమాలో మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటించగా, సీనియర్ నటుడు డాక్టర్ రాజశేఖర్ కీలక పాత్రలో కనిపించారు. అలాగే అతుల్ కుల్కర్ణి కూడా తన నటనతో ఆకట్టుకున్నారు. ఇక సంగీత దర్శకుడు జిబ్రాన్ అందించిన నేపథ్య సంగీతం ఈ సినిమాకు మరింత బలం చేకూర్చింది. ముఖ్యంగా రేసింగ్ సీక్వెన్స్‌లలో ఆయన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ప్రేక్షకులను సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెడుతోందని సినీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు. కొత్త కాన్సెప్ట్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎలిమెంట్స్ కలగలిపిన 'బైకర్' ప్రేక్షకుల మనసులు గెలుచుకుంటూ బాక్సాఫీస్ వద్ద విజయపథంలో దూసుకుపోతోంది. రాబోయే రోజుల్లో ఈ సినిమా మరింత భారీ వసూళ్లు సాధించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# ది ప్యారడైజ్' ఫస్ట్ సింగిల్ సంచలనం..

## 100 మిలియన్ వ్యూస్‌తో రికార్డు సృష్టించిన 'ఆయా షేర్'!




నేచురల్ స్టార్ నాని, టాలెంటెడ్ డైరెక్టర్ శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న మాస్ పీరియడ్ డ్రామా 'ది ప్యారడైజ్'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలను మరింత పెంచుతూ తాజాగా విడుదలైన మొదటి సింగిల్ 'ఆయా షేర్' సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. ఈ పాట విడుదలైన కొద్ది రోజుల్లోనే 100 మిలియన్ వ్యూస్ మార్క్‌ను దాటి అరుదైన రికార్డు సృష్టించింది. సినిమా విడుదలకు ముందే ఈ స్థాయి వ్యూస్ సాధించడం విశేషం. ముఖ్యంగా నాని కెరీర్‌లోనే సినిమా రిలీజ్ కాకముందే 100 మిలియన్ వ్యూస్ దాటిన తొలి పాటగా 'ఆయా షేర్' నిలిచింది.ఇంకా ఒక విశేషం ఏమిటంటే, అత్యంత వేగంగా ఈ ఘనతను అందుకున్న ట్రాక్‌లలో ఇది ఒకటిగా నిలవడం. దీంతో ఈ పాట మ్యూజిక్ చార్ట్‌లను షేక్ చేస్తోంది. రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ అందించిన మాస్ బీట్స్ ఈ పాటకు ప్రధాన బలం కాగా, నాని ఎనర్జిటిక్ డ్యాన్స్ మూమెంట్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం ఈ పాటలోని హుక్ స్టెప్ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, యూట్యూబ్ షార్ట్స్‌లో అభిమానులు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఈ స్టెప్‌ను రీక్రియేట్ చేస్తూ వీడియోలు షేర్ చేస్తున్నారు. దీంతో 'ఆయా షేర్' మరింత వైరల్ అవుతోంది. ఈ పాటను భారీ సెట్‌లో, స్లమ్ బ్యాక్‌డ్రాప్‌లో ఎంతో రిచ్‌గా చిత్రీకరించారు. విజువల్స్‌లో నాని రగ్గడ్ లుక్, హై-ఎనర్జీ బీట్స్‌కు పర్ఫెక్ట్‌గా మ్యాచ్ అవుతూ మాస్ ఆడియన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఇక 'ది ప్యారడైజ్' చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఇప్పటికే గ్లింప్స్, ఫస్ట్ సింగిల్‌తో హైప్ పెరిగిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సెన్సేషన్ క్రియేట్ చేస్తుందో అన్న ఆసక్తి సినీ ప్రియుల్లో నెలకొంది. 'ఆయా షేర్' సాంగ్ సక్సెస్‌తో 'ది ప్యారడైజ్'పై అంచనాలు మరింత పెరిగాయి. రిలీజ్‌కు ముందే రికార్డులు సృష్టిస్తున్న ఈ సినిమా, విడుదలైన తర్వాత కూడా అదే జోరు కొనసాగిస్తుందా అనేది చూడాలి.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831